teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 83 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శుక్రవారం | 29 ఆగస్టు 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## ఉత్తర తెలంగాణలో సీఎం ఏరియల్ సర్వే

హైదరాబాద్, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు పలు జిల్లాల్లో వరదలు బీభత్సం సృష్టించాయి. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి వరద ప్రభావిత ప్రాంతాలైన ఉత్తర తెలంగాణలోని పెద్దపల్లి, కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఏరియల్ సర్వే నిర్వహించి, పరిస్థితిని సమీక్షించారు. ఈ సర్వేలో సీఎం రేవంత్ రెడ్డితోపాటు భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు.





## రాష్ట్రంలో తొలి స్పోర్ట్స్ హబ్ బోర్డు సమావేశం

క్రీడా, వ్యాపార ప్రముఖులు, అధికారులు హాజరు

2025, 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా సమీక్ష

.. వివరాలు 2లో




## సెప్టెంబర్ 7న బిగ్ బాస్ 9 ప్రారంభం

డబుల్ హౌస్ డబుల్ డోస్ మోటోతో సీజన్ 9

విడుదలచేసిన బిగ్ బాస్ 9 ప్రోమో

కంటెస్టెంట్‌గా వెన్నెల కిషోర్ ఎంట్రీ కన్ఫామ్

.. వివరాలు 2లో




## కవితకు చెక్ పెట్టేందుకు
# కేటీఆర్ ప్లాన్..?

### జాగృతి పేరుతో కవిత సొంత కుంపటి
### ఇందూరు పాలిటిక్స్‌పై కేటీఆర్ ఫోకస్

- నిజామాబాద్ లో పార్టీ పటిష్టతకు కేటీఆర్ కార్యాచరణ
- వరుస చేరికలతో గులాబీ పార్టీలో కొత్త జోష్
- స్వయంగా కుండువాలు కప్పుతున్న కేటీఆర్
- దీనితో కవిత సైడ్ అయినట్టేనా..?
- రాబోయే స్థానిక, ఉప ఎన్నికలపై బీఆర్ఎస్ వ్యూహం
- బాల్కొండ, బాన్సువాడలో పార్టీ పరిస్థితిపై ప్రత్యేక దృష్టి
- ఆర్మూర్, బాల్కొండల నుంచి చేరికలు
- త్వరలో బాన్సువాడ నుంచి కూడా

02




తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తర్వాత, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు బీఆర్ఎస్ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, ఉప ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ బలహీనపడిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లాపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ముఖ్యంగా, కొన్నాళ్లుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, సొంతంగా 'జాగృతి' సంస్థతో కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో, ఇందూరు రాజకీయాలను కేటీఆర్ తన ఆధీనంలోకి తీసుకున్నారనే చర్చ రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది.

## తెలంగాణను వదలని వర్షాలు

మరో నాలుగు రోజులు భారీ వానలు

ఇప్పటికే పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

కామారెడ్డి, సిరిసిల్ల, మెదక్, సిద్దిపేట జిల్లాలపై వర్షాల ప్రభావం

పలు జిల్లాలకు రెడ్, ఆరెంజ్, యెల్లో అలర్ట్ జారీ



తెలంగాణ బ్యూరో, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో గత మూడు రోజులుగా వర్షాలుగా కురుస్తున్న సంగతి తెలిసిందే. అయితే రానున్న మరో నాలుగు రోజులు రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్ర తెలిపింది. బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం అది ఈరోజు ఉదయానికి బలహీనపడి దక్షిణ ఒడిశా ప్రాంతంలో అల్పపీడనంగా కేంద్రీకృతమైందని పేర్కొంది. ఇందుకు అనుబంధంగా ఉన్న ఉపరితల ఆవర్తనం 7.6 కి.మీ ఎత్తులో కొనసాగుతున్నట్టుగా

మిగతా 2 లో

## హైదరాబాద్‌కు బీచ్

కృత్రిమ బీచ్ కు ప్రభుత్వ అనుమతి

35 ఎకరాల్లో రూ.225 కోట్లతో వ్యయంతో నిర్మాణం



02



### ప్రధాని మోడీ తల్లిపై రాహుల్ గాంధీ
## అనుచిత వ్యాఖ్యలు

కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పందిస్తూ.. ఫైర్

140 కోట్ల మంది దేశ ప్రజలు ఎప్పటికీ క్షమించరని వాఖ్యలు

తీన్మార్ డెస్క్, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): బీహార్ ఎన్నికలు దగ్గరలో ఉండటంతో రాహుల్ గాంధీ ఆ రాష్ట్రంలో ఓటర్ అధికార యాత్ర పేరుతో ఆర్జేడితో కలిసి యాత్ర చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ యాత్రలో భాగంగా కాంగ్రెస్

మిగతా 2 లో

### ఓటర్ జాబితా రూపకల్పనలో
## అక్రమాలకు అవకాశం

ప్రభుత్వంపై కేటీఆర్ అనుమానం వ్యకం

సానుభూతిపరుల ఓట్లు గల్లంతుకాకుండా చూసుకోవాలి

పార్టీ నాయకులకు ఆదేశాలు జారీ



హైదరాబాద్, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల ఓటర్ జాబితా రూపకల్పనలో ప్రభుత్వం అక్రమాలకు పాల్పడే అవకాశం ఉంది బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ 30వ తేదీ లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వానికి

మిగతా 2 లో




### తెలంగాణ వైపు తొలిసారిగా
## అమృత్ భారత్

వచ్చే నెలలో పరుగులుపెట్టనున్న అమృత్ భారత్

సికింద్రాబాద్- ముజఫర్‌పూర్ మధ్య రాకపోకలు

ఉత్తరాది వలస కార్మికులు, యాత్రికులకు భారీ ఊరట




## తెలంగాణ న్యాయ శాఖ కార్యదర్శిగా జడ్జి బి.పాపిరెడ్డి

హైకోర్టు సిఫార్సు మేరకు ప్రభుత్వం నియామకం

సీఎస్ కే.రామకృష్ణారావు జీవో నంబర్ 547 జారీ

.. వివరాలు 2లో

### పాత వరద వీడియోలు
## షేర్ చేయొద్దు

తెలంగాణ ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి

వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించిన బృందాలు

వరదల సమాచారం షేర్ చేసే ముందు తనిఖీ చేయండి

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారంపై పోలీసుల హెచ్చరిక




## వర్షాల్లో చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకుంటాం

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): వర్షాల్లో చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. రెండు రోజులుగా మెదక్, కామారెడ్డి, సిరిసిల్ల జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురుస్తున్నాయని, వర్షాలు వరదలపై ఎప్పటికప్పుడు ప్రభుత్వం సమీక్ష చేస్తున్నదన్నారు. సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్ డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయన్నారు. మా ప్రభుత్వం వచ్చిన మొదట్లో ఎదుర్కొన్న విపత్తుని దృష్టిలో ఉంచుకుని ప్రతి ప్రాంతంలో 100 కంటె ఎక్కువ మందితో ఎన్డీఆర్ఎఫ్, ఎస్ డీఆర్ఎఫ్

మిగతా 2 లో



### తెలంగాణ రాజకీయాల్లో
## అరుదైన దృశ్యం

ఒకరికొకరు ఎదురుపడ్డ కేంద్ర మంత్రి బండి సంజయ్, కేటీఆర్

ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఇరువురు నేతలు

02




## సీఎం రేవంత్ రెడ్డి రూపంలో వినాయక విగ్రహం

మనిషి రూపంలో ఏర్పాటుపై అభ్యంతరాలు వ్యక్తం

విగ్రహాన్ని తొలగించాలని ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): సీఎం రేవంత్ రెడ్డి రూపంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని తొలగించారు. హైదరాబాద్ గోషామహల్ నియోజకవర్గం అఘాపూరలో ఫిషరీస్ కమిటీ చైర్మన్ మెట్టు సాయి కుమార్ ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అయితే దేవుడి విగ్రహాన్ని మనిషి రూపంలో ఏర్పాటు

మిగతా 2 లో

# కవితకు చెక్ పెట్టేందుకు కేటీఆర్ ప్లాన్..?

తెలంగాణ బ్యూరో, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన తర్వాత, భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అంతర్గత సంక్షోభంలో ఉన్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా, పార్టీలో రెండో స్థానం అని చెప్పబడే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత మధ్య ఏర్పడిన అంతరం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఇన్నాళ్లు కవిత కనుసన్నల్లో నడిచిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా రాజకీయాలపై కేటీఆర్ స్వయంగా దృష్టి పెట్టడం, వరుసగా చేరికల కార్యక్రమాలు నిర్వహించడం ఈ చర్చకు మరింత బలం చేకూరుస్తోంది.

**కవిత 'జాగృతి'లో కొత్త కుంపటి**

**అసలు ఏం జరుగుతోంది..?**

గత కొంతకాలంగా కవిత బీఆర్ఎస్ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఆమె తన సొంత సంస్థ 'జాగృతి' బ్యానర్‌పైనే అన్ని కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ జెండా లేకుండానే కవిత కార్యక్రమాల్లో పాల్గొనడం, ప్రసంగించడం పార్టీలో కొంత గందరగోళానికి దారితీసింది. దీంతో, ఆమె బీఆర్ఎస్ ను పక్కన పెట్టి, భవిష్యత్ లో సొంత మార్గాన్ని ఎంచుకుంటారేమోనన్న ఊహాగానాలు మొదలయ్యాయి. ఒకవైపు పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కేటీఆర్ శ్రమిస్తుంటే, కవిత తన స్వంత బ్రాండ్‌ను పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇదే విషయంపై కేటీఆర్ అసంతృప్తిగా ఉన్నారని, అందుకే నిజామాబాద్ జిల్లా బాధ్యతలను తన భుజస్కంధాలపై వేసుకున్నారని తెలుస్తోంది.

**నిజామాబాద్ లో బీఆర్ఎస్ బలహీనత**

గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్ ను నిజామాబాద్ జిల్లాలో తీవ్రంగా దెబ్బతీశాయి. ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది నియోజకవర్గాల్లో పార్టీ కేవలం రెండు స్థానాల్లో మాత్రమే గెలిచింది. మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి బాల్కొండ నుంచి గెలిచినప్పటికీ, బాన్సువాడలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ లో చేరారు. ఈ పరిస్థితి పార్టీని మరింత బలహీనపరిచింది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు, ఉప ఎన్నికలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో పార్టీని మళ్లీ గాడిన పెట్టాల్సిన బాధ్యత కేటీఆర్‌పై పడింది.



**పార్టీని తిరిగి బలోపేతం చేసే లక్ష్యంతో కేటీఆర్**

పార్టీని తిరిగి బలోపేతం చేసే లక్ష్యంతో కేటీఆర్ రంగంలోకి దిగారు. అధికార కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో అసంతృప్తితో ఉన్న నేతలను, కార్యకర్తలను గుర్తించి, వారితో సంప్రదింపులు జరుపుతున్నారు. తెలంగాణ భవన్‌లో అట్టహాసంగా నిర్వహిస్తున్న చేరికల కార్యక్రమాల్లో కేటీఆర్ స్వయంగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్నారు. ఈ చేరికలు నిజామాబాద్ జిల్లాలోని పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ముఖ్యంగా, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో నేతలు పార్టీలో చేరడం కేటీఆర్ వ్యూహం ఫలిస్తుందనడానికి నిదర్శనం. త్వరలోనే బాన్సువాడ నుంచి కూడా భారీగా చేరికలు ఉండబోతున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**భవిష్యత్ రాజకీయం ఎలా ఉండబోతుంది?**

కవిత గతంలో నిజామాబాద్ ఎంపీగా గెలిచి, జిల్లా రాజకీయాలపై పట్టు సాధించారు. ఆమె వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ లోక్‌సభ పరిధిలోని ఏదైనా ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేయవచ్చని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో కేటీఆర్ నేరుగా జిల్లా రాజకీయాల్లో జోక్యం చేసుకోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇది కవిత రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందా లేదా ఇద్దరి మధ్య అంతర్గత సమన్వయం ఉందా అనేది వేచి చూడాలి. అయితే, బీఆర్ఎస్ ఇప్పుడు కేటీఆర్ నాయకత్వంలోనే ముందుకు వెళ్తుందని, పార్టీ భవిష్యత్తు ప్రణాళికలు ఆయన నేతృత్వంలోనే ఉంటాయని స్పష్టమవుతోంది. ఈ పరిణామాలు రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలను ప్రభావితం చేయవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.




# తెలంగాణ న్యాయ శాఖ కార్యదర్శిగా జడ్జి బి.పాపిరెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): తెలంగాణ న్యాయ శాఖ కార్యదర్శిగా మహబూబ్ నగర్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి బి.పాపిరెడ్డి నియమితులయ్యారు. తెలంగాణ హైకోర్టు సిఫార్సు మేరకు రాష్ట్ర ప్రభుత్వం పాపిరెడ్డిని డిప్యూటేషన్ పద్దతిలో నియమిస్తూ సీఎస్ కే.రామకృష్ణారావు గురువారం జీవో నంబర్ 547 జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఏడాది కాలం పాటు ఆయన ఈ బాధ్యతలు నిర్వహించనున్నట్లు జీవోలో పేర్కొన్నారు. రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన రేండ్ల తిరుపతి డిప్యూటేషన్ ముగియడంతో గత వారం ఆయన రిలీవ్ అయ్యారు. తన డిప్యూటేషన్ పొడిగించాలని రేండ్ల తిరుపతి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అర్జీ పెట్టుకున్నారు. దీన్ని ప్రభుత్వం తిరస్కరించింది. ఆయన స్థానంలో న్యాయశాఖ అదనపు కార్యదర్శి సునీతకు తాత్కాలిక ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో లా సెక్రటరీ పోస్టు కోసం హైకోర్టు రిజిస్ట్రార్ ప్రభుత్వానికి ఐదు పేర్లతో కూడిన జాబితాను పంపించింది. ఇందులో నుంచి బి.పాపిరెడ్డి పేరును ప్రభుత్వం ఫైనల్ చేసింది.

# సీఎం రేవంత్ రెడ్డి రూపంలో వినాయక విగ్రహం

మొదటి పేజీ తరువాయి

చేయడంపై అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ విగ్రహాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని కాబట్టి విగ్రహాన్ని తొలగించేలా చర్యలు తీసుకోవాలని డీసీపీని కోరారు. ఈ నేపథ్యంలోనే విగ్రహాన్ని తొలగించినట్టు తెలుస్తోంది. విగ్రహాన్ని తొలగించి మరో విగ్రహం ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకుడు మెట్టు సాయికుమార్‌కు సౌత్ వెస్ట్ డీసీపీ సూచించినట్టు సమాచారం.

# వర్షాల్లో చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకుంటాం

మొదటి పేజీ తరువాయి

బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఎక్కువ ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గురువారం ఓ న్యూస్ చానల్ తో మాట్లాడిన ఆయన వరదల పరిస్థితిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎప్పటికప్పుడు మంత్రులు, అధికారుల నుంచి సమాచారం తీసుకుని ఆదేశాలు ఇస్తూనే ఉన్నారన్నారు. పోచారం డ్యామ్ ను ఓవర్ ఫ్లో అయిందని అదృష్టవశాత్తు కాపాడుకోగలిగామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు చిన్నతరహా నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తి సామర్థ్యంతో నిండిపయాయని వాటిని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిరంతరం మానిటరింగ్ చేస్తున్నారని చెప్పారు. కామారెడ్డిలో ఇద్దరు చనిపోయారని ఇది దురదృష్టకరం అన్నారు. వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున, నా పక్షాన అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# తెలంగాణ రాజకీయాల్లో అరుదైన దృశ్యం

కామారెడ్డి, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాజకీయాల్లో అరుదైన దృశ్యం కనిపించింది. నిత్యం ఒకరిపై మరొకరు ఆరోపణలు గుప్పించుకునే కేంద్ర మంత్రి బండి సంజయ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒకరికొకరు ఎదురుపడ్డారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గురువారం ఇరువురు నేతలు సిరిసిల్లా జిల్లాలో ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు వద్ద చిక్కుకుపోయిన ఐదుగురు రైతులను హెలికాప్టర్ సాయంతో గురువారం రెస్క్యూ చేశారు. ఈ సందర్భంగా బాధితులను పరామర్శించేందుకు బండి సంజయ్ అక్కడే ఉన్నారు. బాధితులు బయటకు వచ్చాక వారిని పరామర్శించి అక్కడి నుంచి కేంద్ర మంత్రి బయలుదేరుతున్నారు. అదే సమయంలో అప్పర్ మానేరు జలాశయం వద్దకు కేటీఆర్ చేరుకున్నారు. ఈ క్రమంలో ఒకరినొకరు ఎదురుపడ్డారు. పరస్పరం షేక్ హ్యాండ్ ఇచ్చుకుని చిరునవ్వులతో ఆప్యాయంగా పలకరించుకున్నారు. కాసేపు ముచ్చటించుకున్నారు. దీంతో అక్కడ ఒక్కసారిగా సందడి వాతావరణం ఏర్పడింది. ఇరువురు నేతల అభిమానులు తమ తమ నేతలకు జై అంటూ నినాదాలు చేశారు.



# తెలంగాణను వదలని వర్షాలు

మొదటి పేజీ తరువాయి



తెలిపింది. ఇది నైరుతి వైపు వంపు కలిగి ఉండటం వల్ల తెలంగాణ రాష్ట్రంపై ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొంది. ఈ ప్రభావంతో తెలంగాణలో రానున్న నాలుగు రోజులు పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపింది. అయితే ఇప్పటికే కురుస్తున్న భారీ వర్షాలతో తెలంగాణలోని పలు జిల్లాల్లో వాగులు, వంకలు పొంగిపోర్లుతున్నాయి. కొన్ని చోట్ల ఇళ్లలోని నీరు చేరింది. పలుచోట్ల రోడ్లు దెబ్బతిన్నాయి. వేలాది ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ముఖ్యంగా కామారెడ్డి, సిరిసిల్ల, మెదక్, సిద్దిపేట జిల్లాలకు వర్షాల వల్ల తీవ్రంగా ప్రభావితమయ్యాయి.

**ఈ జిల్లాలకు రెయిన్ అలర్ట్...**

గురువారం (ఆగస్టు 28) రోజున తెలంగాణలోని నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి జిల్లాలో అక్కడక్కడ అతి భారీ నుంచి అంత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ క్రమంలోనే ఆ నాలుగు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. అలాగే ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, హన్మకొండ, వరంగల్, జనగాం, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాలలో అక్కడక్కడ భారీ నుండి అతి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్న హైదరాబాద్ వాతావరణ కేంద్రం, ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఇక, భద్రాద్రి కొత్తగూడెం, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మహబూబ్ నగర్ జిల్లాలలో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు (గాలి వేగం గంటకు 30-40 కి.మీ)తో కూడిన వర్షాలు పడతాయని తెలిపింది. శుక్రవారం (ఆగస్టు 29) రోజున రాష్ట్రంలోని ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాలలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు (గాలి వేగం గంటకు 30-40 కి.మీ)తో కూడిన వర్షాలు పడతాయని పేర్కొంది. శనివారం (ఆగస్టు 30) రోజున రాష్ట్రంలోని కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలలో అక్కడక్కడ అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలోని ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, హైదరాబాద్, యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు (గాలి వేగం గంటకు 30-40 కి.మీ)తో కూడిన వర్షాలు పడతాయని పేర్కొంది. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాలలోఅక్కడక్కడ బలమైన ఉపరితల గాలులు (గాలి వేగం గంటకు 30-40 కి.మీ) వీచే అవకాశం ఉందని తెలిపింది.

# తెలంగాణ వైపు తొలిసారిగా అమృత్ భారత్




తెలంగాణ బ్యూరో, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): తెలంగాణ వైపు తొలిసారిగా అమృత్ భారత్ రైలు పరుగులు పెట్టనుంది సెప్టెంబర్‌లో పట్టాలెక్కనుంది. ఉత్తరాది ప్రయాణం నిమిత్తం అందుబాటులోకి రానుంది. తక్కువ చార్జీలుండే అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుతో సామాన్యులు, వలస కార్మికులు తదితర వర్గాల ప్రయాణికులకు భారీ ఊరట కలగనుంది. సికింద్రాబాద్ నుంచి బీహార్‌లోని ముజఫర్‌పూర్‌కు అమృత్ భారత్ రైలును ప్రవేశపెట్టనున్నారు. దేశవ్యాప్తంగా మూడో శ్రేణికి చెందిన ఈ రైళ్లను ప్రవేశపెట్టనున్నట్లు రైల్వే బోర్డు కొద్దిరోజుల క్రితమే ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఈ మేరకు హైదరాబాద్ నుంచి పట్నా, గయా తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించేవారి కోసం ఈ రైలును ప్రవేశపెడుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారి ఒకరు తెలిపారు. ఇది కాజీపేట్, పెద్దపల్లి, బెల్లంపల్లి, సిర్పూర్‌కాగజ్ నగర్, బల్లార్షా, నాగ్‌పూర్, గోండియా, దుర్గ్, రాయ్‌పూర్, బిలాస్‌పూర్, ఝార్సుగూడ, రూర్కేలా, హతియా, రాంచీ, బొకారో, పరస్‌నాథ్, కోడెర్మా, గయాజీ, జెహనాబాద్, పట్నా తదితర ప్రాంతాల మీదుగా రాకపోకలు సాగించనుంది. ఈ అమృత్‌భారత్ రైలులో 11 సాధారణ బోగీలు, 8 స్లీపర్ క్లాస్, ఒక ప్యాంట్రీ కార్, 2 సెకండ్ క్లాస్-కమ్-లగేజ్-కమ్-గార్డ్ వ్యాన్‌లు ఉంటాయి. దివ్యాంగుల కోసం ఒక కంపార్ట్‌మెంట్ ఉండేవిధంగా రూపొందించారు.

**వలస కార్మికులకు ప్రయోజనం.**

హైదరాబాద్ నుంచి ముజఫర్‌పూర్‌కు ప్రస్తుతం ఒక్క వీక్లీ ఎక్స్‌ప్రెస్ (05293/05294) మాత్రమే అందుబాటులో ఉంది. ఇది కాకుండా సికింద్రాబాద్-దానాపూర్ ఎక్స్‌ప్రెస్ (12791/12792) ప్రతిరోజు రాకపోకలు సాగిస్తోంది. కానీ, ప్రయాణికుల రద్దీ, డిమాండ్ కారణంగా ఈ రైళ్లు ఏ మాత్రం సరిపోవడం లేదు. ప్రతిరోజు దానాపూర్ ఎక్స్‌ప్రెస్ నడిచినా మరో రెండు రైళ్లకు సరిపడా ప్రయాణికులు పడిగాపులు కాస్తున్నారు. హైదరాబాద్‌లో స్థిరపడ్డ లక్షలాది మంది ఉత్తరాది వలస కార్మికుల కుటుంబాలకు ఈ ఒక్క రైలే రాకపోకలకు అనుకూలంగా ఉంది. మరోవైపు అయోధ్యలో రామమందిరం ప్రారంభించిన అనంతరం నగరం నుంచి వెళ్లే భక్తుల సంఖ్య కూడా భారీగా పెరిగింది. ప్రయాగ, వారణాసి తదితర ప్రాంతాలతోపాటు భక్తులు అయోధ్యను సందర్శిస్తున్నారు. ఇలా అన్ని విధాలుగా డిమాండ్ పెరిగినప్పటికీ తగినన్ని రైళు లేకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అమృత్‌భారత్ ద్వారా అతి తక్కువ చార్జీలతోనే ప్రయాణికులు గయ, పట్నా తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు అవకాశం లభించనుంది. 2023లో దేశంలో అమృత్‌భారత్ రైళ్లను ప్రవేశపెట్టినా సెప్టెంబర్‌లో పట్టాలెక్కనున్న సికింద్రాబాద్-ముజఫర్‌పూర్ ఎక్స్‌ప్రెస్ తెలంగాణకు మొదటి అమృత్ భారత్ రైలు కానుంది. సెప్టెంబర్‌లో జరగనున్న బీహార్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఈ రైళ్లను పట్టాలెక్కించేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. సికింద్రాబాద్-ముజఫర్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌తోపాటు మరో 4 రైళ్లు దేశంలోని పలు ప్రాంతాల నుంచి బీహార్‌లోని పలు నగరాలకు నడుపనున్నారు.

**మరికొన్ని అమృత్ భారత్ రైళ్లు**

హైదరాబాద్ నుంచి మరికొన్ని అమృత్‌భారత్ రైళ్లను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. హైదరాబాద్- కోల్‌కత్తా (సంత్రాగచ్చి), చర్లపల్లి- గౌహతి, హైదరాబాద్-కన్యాకుమారి, సికింద్రాబాద్-తిరువనంతపురం మధ్య అమృత్‌భారత్ సూపర్‌ఫాస్ట్ రైళ్లను నడిపే ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. కోల్‌కత్తాకు ప్రవేశపెట్టనున్న రైలును విజయవాడ- విశాఖపట్నం మార్గంలో కాకుండా కాజీపేట్, పెద్దపల్లి, బల్లార్షా మార్గంలో నడపాలని ఉత్తర తెలంగాణకు చెందిన ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

# హైదరాబాద్‌కు బీచ్

హైదరాబాద్, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): బీచ్ అంటే అందరికీ భలే హుషారు వస్తుంది. సముద్రం ఒడ్డున వచ్చి పోయే అలలతో ఆడుకోవడం, బీచ్ ఒడ్డున కూర్చొని సముద్రాన్ని చూస్తూ గడపడం మనసుకు ఉత్తేజాన్ని ఇస్తుంది. అయితే ఇదంతా సముద్ర తీర ప్రాంతాల్లో ఉండేవారికే సాధ్యం అవుతుంది గాని, తీర ప్రాంతం లేని వాళ్ళు మాత్రం ఉసూరుమనాల్సిందే. లేదంటే ఏడాదికో ఆర్నెల్లకో ప్రత్యేకంగా సముద్ర తీర ప్రాంతాలకు వెళ్లి అక్కడ రెండు మూడు రోజులు గడిపి వస్తారు. ఇప్పటి వరకు హైదరాబాద్ వాసుల పరిస్థితి ఇదే. బీచ్ కి వెళ్ళాలి అంటే గోవా, వైజాగ్, కేరళకో వెళ్లేవారు. ఇంకా డబ్బులు ఉన్నవాళ్ళైతే విదేశాల్లో ఉన్న బీచ్ లకు వెళ్లి గడిపి వస్తుంటారు. కానీ ఇప్పుడా పరిస్థితి మారనుంది. హైదరాబాద్ కే బీచ్ తీసుకురానున్నారు త్వరలో కానీ సముద్రం లేకుండా ఇక్కడికి బీచ్ ఎలా తీసుకు వస్తారు అనుకుంటున్నారా? లేక ఏప్రిల్ వెళ్ళిపోయాక కూడా ఏప్రిల్ ఫూల్ చేయడానికి ఇదో ప్రాంక్ అనుకుంటున్నారేమో కానీ అది నిజం. త్వరలోనే నగరానికి బీచ్ ను తీసుకురానున్నారు. అయితే అది కృత్రిమ బీచ్. నగరంలోని కొత్వాల్ గూడలో ఈ కృత్రిమ బీచ్ నెలకొల్పేందుకు ప్రభుత్వం అనుమతి కూడా ఇచ్చింది. ప్రభుత్వ-ప్రయివేట్ పార్ట్నర్ షిప్ పద్ధతిలో, సుమారు 35 ఎకరాల్లో రూ.225 కోట్లతో వ్యయంతో డిసెంబర్ నుంచి ఈ ఆర్టిఫీషియల్ బీచ్ నిర్మాణం పనులు మొదలు కానున్నాయి. బీచ్ లో ఫ్లోటింగ్ విల్లాస్, లగ్జరీ హోటళ్లు, వేవ్ పూల్స్, థియేటర్స్, ఫుడ్ కోర్ట్స్, వంటివి కూడా ఉండనున్నాయి. ఇక హైదరాబాద్ పీపుల్ బీచ్ కోసం ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేదన్నమాట. నగరంలోనే ఉంటూ వారాంతాలు ఈ బీచ్ కి వెళ్లి ఎంజాయ్ చేసి రావొచ్చు.

# రాష్ట్రంలో తొలి స్పోర్ట్స్ హబ్ బోర్డు సమావేశం



హైదరాబాద్, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు మొదటి సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. గురువారం బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో హైదరాబాద్ వేదికగా సమావేశం నిర్వహించారు. క్రీడా, వ్యాపార రంగ ప్రముఖులు, అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ భేటీలో బోర్డు సభ్యులైన కపిల్ దేవ్, పుల్లెల గోపీచంద్, అభినవ్ బింద్రా, బైచుంగ్ భూటియా, సంజీవ్ గోయెంకా, ఉపాసన కొణిదెల తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర నూతన స్పోర్ట్స్ పాలసీ 2025, 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా ఈ సమీక్ష జరిగినట్లు సీఎం కార్యాలయ వర్గాలు తెలిపాయి. హైదరాబాద్ వేదికగా 2036 ఒలింపిక్స్ నిర్వహణకు బిడ్ వేసేందుకు గల అవకాశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. అలాతే తెలంగాణలో క్రీడలు, లాంగ్ టర్మ్ అథ్లెటిక్ డెవెలప్‌మెంట్, ఆధునిక మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించినట్లు సమాచారం. స్టేడియాల ఆధునికీకరణ, 56 నియోజకవర్గాల్లో మినీ స్టేడియాల నిర్మాణంపై ఈ సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది.

# సెప్టెంబర్ 7న బిగ్ బాస్ 9 ప్రారంభం

తెలంగాణ బ్యూరో, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): భారత దేశ వ్యాప్తంగా బిగ్ బాస్ రియాలిటీ షో అన్ని సీజన్లు భారీ రెస్పాన్స్ సంపాదించుకున్నాయి. ముఖ్యంగా తెలుగులో హీరో నాగార్జున వ్యాఖ్యాతగా వ్యవహరించిన అన్ని సీజన్లు భారీ హిట్ సాధించాయి. కోట్లాది మంది అభిమానులను సొంతం చేసుకున్న బిగ్ బాస్ ఇప్పటి వరకు 8 సీజన్లను పూర్తి చేసుకొని 9వ సీజన్‌లోకి అడుగుపెడుతుంది. ఈ మేరకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తవ్వగా తాజాగా సీజన్ 9 ప్రారంభానికి సంబంధించిన ప్రోమో విడుదల చేశారు. అందులో టాలీవుడ్ స్టార్ కమెడియన్ అయిన వెన్నెల కిషోర్ బిగ్ బాస్ హౌస్ లో కంటెస్టెంట్‌గా వెళ్తున్నట్లు కన్ఫామ్ చేశారు. అలాగే ఈ బిగ్ బాస్ 9 సీజన్ ఈ సారి డబుల్ హౌస్ డబుల్ డోస్ మోటో తో ప్రేక్షకుల ముందుకు సెప్టెంబర్ 7వ తేదీ నుంచి రాబోతున్నట్లు ప్రకటించారు. ఇదిలా ఉంటే గత సీజన్ లో కొంత మందిని మాత్రమే సామాన్యులను కంటెస్టెంట్లుగా తీసుకొగా ఈ సారి మరింత మందిని బిగ్ హౌస్ లోకి తీసుకురానున్నారు. ఇందులో భాగంగా గతంలో బిగ్ బాస్ హౌస్ లోకి వెళ్లి వచ్చిన వారితో అగ్ని పరీక్ష పేరుతో సామాన్యులను ఎంపిక చేసే పనులు మొదలయ్యాయి. ఏది ఏమైనప్పటికి తెలుగు ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న బిగ్ బాస్ కొత్త సీజన్ తేదీని విడుదల చేయడంతో అభిమానులు ఫుల్ హ్యాపీ అవుతున్నారు.

# ప్రధాని మోడీ తల్లిపై రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

ఎంపీ రాహుల్ గాంధీ భారత ప్రధాని నరేంద్ర మోడీ తల్లి పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో బీజేపీ నేతలు రాహుల్ గాంధీ ప్రవర్తనపై తీవ్ర స్థాయిలో మండి పడుతున్నారు. ఈ క్రమంలో కేంద్ర హెూం మంత్రి అమిత్ షా స్పందిస్తూ.. ఫైర్ అయ్యాడు. బీహార్ లో ప్రధాని మోడీ దివంగత తల్లిపై దుర్భాషలతో నిండిన దుర్భాషను ఉపయోగించడం ఖండించదగినదని, వారి వ్యాఖ్యలు మన ప్రజాస్వామ్యానికి కూడా మచ్చ అని, రాహుల్ గాంధీ నాయకత్వంలో, కాంగ్రెస్ రాజకీయాలు అత్యల్ప స్థాయికి చేరుకున్నాయని అన్నారు. గత 11 సంవత్సరాలుగా ఒక పేద తల్లి కొడుకు ప్రధానమంత్రి కుర్చీలో కూర్చుని సమర్థవంతమైన నాయకత్వంలో దేశాన్ని నిరంతరం ముందుకు తీసుకెళ్తున్న తీరును వారు సహించలేకపోతున్నారని షా అన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీ తన పాత పద్ధతులకు, స్వభావానికి తిరిగి దేశ ప్రజలకు చూపిస్తుందని, వారి పద్ధతి దేశ రాజకీయ సంస్కృతిని విషపూరితం చేసిందని. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి నేటి వరకు, గాంధీ కుటుంబం మోడీపై ద్వేషాన్ని వ్యాప్తి చేయడంలో ఏ రాయిని వదిలిపెట్టలేదు. ఇది ప్రతి తల్లికి, ప్రతి కొడుకుకు అవమానమని, వారిని 140 కోట్ల మంది దేశ ప్రజలు ఎప్పటికీ క్షమించరని ఈ సందర్భంగా అమిత్ షా చెప్పుకొచ్చారు.

# పాత వరద వీడియోలు షేర్ చేయొద్దు

తెలంగాణ బ్యూరో, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): భారీ వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రంలోని పలు జిల్లాలు అతలాకుతలం అయ్యాయి. ముఖ్యంగా కామారెడ్డి, మెదక్, నిజామాబాద్, నిర్మల్, సిద్ధిపేట, ఖమ్మం జిల్లాల్లో వాగులు, నదులు పొంగిపొరలాగా పలుచోట్ల చెరువులు కట్టలు తెగి ఊళ్లన్నీ జలమయం అయ్యాయి. అయితే వరదల్లో చిక్కుకున్న వారిని %ాణ=ఖీ, చీణ=ఖీ% బృందాలు రెస్క్యూ ఆపరేషన్లు చేసి రక్షించాయి. అయితే వరదలపై పలువురు సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. పాత వీడియోలు షేర్ చేస్తూ ప్రజల్ని భయాందోళనకు గురి చేస్తున్నారని దయచేసి అలాంటి తప్పుడు వార్తలు ప్రచారం చేస్తూ, గందరగోళం సృష్టించవద్దని తెలంగాణ పోలీసులు రిక్వెస్ట్ చేస్తున్నారు. వరదల సమాచారాన్ని షేర్ చేసేముందు తొలుత నిర్ధారించుకోవాలని తెలిపారు. అధికారిక ఖాతాల్లో లేదా ప్రభుత్వ యంత్రాంగం ద్వారా నిర్ధారించుకున్న తర్వాతే సమాచారాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయమని కోరారు. వరదలకు సంబంధించిన పాత వీడియోలు వైరల్ అయ్యే అవకాశం ఉంటుందని, అలాంటి వాటిని నమ్మి భయపడవద్దని ప్రజలకు సూచించారు.

# ఓటర్ జాబితా రూపకల్పనలో అక్రమాలకు అవకాశం

మొదటి పేజీ తరువాయి

హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో గురువారం స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఓటర్ జాబితాలో బీఆర్ఎస్ సానుభూతిపరుల ఓట్లు గల్లంతు కాకుండా చూసుకోవాలని పార్టీ నాయకులకు ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల సంఘం ఇచ్చే ఓటర్ జాబితా ముసాయిదాను గ్రామస్థాయిలోనే పరిశీలించి అభ్యంతరాలను అధికారుల దృష్టికి వెంటనే తీసుకువెళ్లాలని సూచించారు. ఓటర్ జాబితాలో అక్రమాలు, అవకతవకలు జరిగితే కమిటీ దృష్టికి తీసుకువెళ్లాలని అన్నారు. ఇందుకోసం ఎమ్మెల్సీలు ఎల్.రమణ, డా.దాసోజు శ్రవణ్, లీగల్ సెల్ ఇంఛార్జ్ భరత్ కుమార్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసినట్లు కేటీఆర్ తెలిపారు.

# రైతులకు యూరియా అందించాలి

రైతులకు మద్దతుగా ధర్నాలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు



ములుగు, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): రైతులకు యూరియా సకాలంలో అందించాలని ములుగు మండల అధ్యక్షుడు శానికొమ్ము రమేష్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈరోజు ములుగు జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారిపై యూరియా కోసం ధర్నా చేస్తున్న రైతులకు మద్దతుగా బిఆర్ఎస్ పార్టీ శ్రేణిలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ములుగు మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేష్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు సకాలంలో యూరియా అందించాలని, రైతులు ఇబ్బంది పడుతున్నా కూడా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని దీనికి ప్రధాన కారణం సమ్మర్ లో వచ్చే యూరియా రాష్ట్ర ప్రభుత్వం సప్లై చేసుకోకపోగా ఇప్పుడు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, ఆయన ఆరోపించారు. రైతులను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని గ్రామాల్లో నిలదీయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవిందు నాయక్, వేములపల్లి బిక్షపతి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుతోట చంద్రమౌళి, దాసరి రమేష్, గరిగే రఘు, ఉయ్యాల భద్రయ్య, పావురాల బిక్షపతి, దూడబోయిన శ్రీనివాస్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

# దశ దిన కర్మలకు శ్రీ రామకృష్ణ సేవా ట్రస్ట్ ఆర్థిక సహాయం



మంగపేట, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా మంగపేట మండలం రాజుపేట గ్రామానికి చెందిన కర్రి పుల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. రోజువారీ హమాలీ పని చేస్తూ జీవనం గడిపే కర్రీ పుల్లయ్య చనిపోవడంతో వారి కుటుంబం దశ దిన కర్మలు చేయుటకు తీవ్ర ఇబ్బంది పడుతుంటే స్థానికులు శ్రీ రామకృష్ణ సేవా ట్రస్ట్ కు సమాచారం అందిచగా శ్రీ రామకృష్ణ సేవా ట్రస్ట్ ఛైర్మెన్ బాడిశ నాగరమేష్ వెంటనే స్పందించి ట్రస్ట్ సభ్యురాలు కొమరం ధనలక్ష్మి చే బాధిత కుటుంబానికి ఐదు వేల రూపాయలు అందజేసి వారి కుటుంబాన్ని ఓదార్చి, అందజేశారు. ఆపదలో వున్నా బాధిత కుటుంబానికి అడగగానే అండగా నిలిచిన శ్రీ రామకృష్ణ సేవా ట్రస్ట్ కు స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు కర్రి శ్రీను, జానపట్ల జయరాజు, జై భీమ్ రామ్మోహన్, కర్రి చందు, కరకపల్లి సత్యం, కర్రి వెంకటేశ్వర్లు, సాయి, కర్రి వెంకన్న, రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో ములుగుకి మూడవ స్థానం

ప్రభుత్వం నుండి ప్రశంసాపత్రం



ములుగు జిల్లా, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): నిరుపేదలకు సొంత ఇళ్లను అందించే లక్ష్యంతో అమలు చేస్తోన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జిల్లాలో వేగవంతం గా జరిగేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేస్తున్నారని జిల్లా కలెక్టర్హదివాకర టి. ఎస్. తెలిపారు. మొదటి విడత మరియు రెండవ విడత లో42 శాతం గ్రౌండింగ్ పూర్తి అయినందున ఈ ఆగస్టు మాసములో రాష్ట్ర స్థాయిలో ములుగు జిల్లాకు మూడవ స్థానం దక్కిన నేపథ్యంలో ప్రభుత్వం నుండి వచ్చిన ప్రశంసాపత్రం, ల్యాప్ టాప్ ని గురువారం కలెక్టర్హతిన ఛాంబర్ లో అదనపు కలెక్టర్ రెవిన్యూ, సి. హెచ్. మహేందర్ జి తో కలిసి పీడీ హౌసింగ్, యస్. సూర్య నారాయణకి అందచేశారు. ఈ సందర్బంగా కలెక్టర్హమాట్లాడుతూ మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసి మన జిల్లా ను రాష్ట్ర స్థాయిలో మంచి స్థానంలో నిలబెట్టెందుకు ప్రజా ప్రతినిధులు, మండల స్పెషల్ అధికారులు, హౌసింగ్ శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీఓ లు, ఎం.పీ.వో.లు, పంచాయతీ అధికారులు కృషి చేయాలని నిర్దేశించారు. క్షేత్ర స్థాయిలో అధికారులు నిర్మాణాల్లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల ను ఎప్పటికప్పుడు సందర్శించి లబ్ధిదారులతో నిరంతరం మాట్లాడుతూ ఇసుక, మొరం తదితర సామాగ్రి నిర్ణిత ధరలకు అందేలాహపర్యవేక్షణ చేస్తున్నారన్నారు.హ

# లంబాడ తీజ్ పండుగ ఉత్సవాల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



ములుగు జిల్లా, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): బంజారా, లంబాడీ సంస్కృతి సాంప్రదాయానికి చాటి చెప్పే పండుగలలో అతి ముఖ్యమైనది తీజ్ పండుగ అని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. గురువారం ములుగు జిల్లా కేంద్రంలో లంబాడ తీజ్ పండుగ ఉత్సవాల్లో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., డి ఎఫ్ ఓ రాహూల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి లతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ లంబాడి సమాజం ఆచార సంప్రదాయాలు ఎంతో గొప్పవని, వాటిని తరతరాలకు అందించడం అభినందనీయం. తీజ్ పండుగ లాంటి వేడుకలు కేవలం మతపరమైనవి కాకుండా, సామాజిక ఐక్యతకు, సాంప్రదాయాల పరిరక్షణకు ప్రతీకలని అన్నారు. ఈ ఉత్సవాల ద్వారా సమాజంలో ఆనందం, ఐక్యత పెరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో లంబాడి సమాజ ప్రముఖులు గోవింద నాయక్, ఇతర పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలు తగ్గేవరకు అధికారులు అందుబాటులోఉండాలి

## ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలి

## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



గోవిందరావు పేట, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): జిల్లాలో భారీ వర్షాలు, వరదల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా వర్షాలు, వరదలు తగ్గేవరకు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, లోతట్టు గ్రామప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. గురువారం గోవిందరావు పేట మండలం ప్రాజెక్టు నగర్ గ్రామం ను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సందర్శించారు. అనంతరం ఎస్.ఎస్. తాడ్వాయి మండలం జాతీయ రహదారి 163 జలగలంచ వద్ద వరద ప్రవాహాన్ని, మొండియాల తోగు వద్ద రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహానికి దెబ్బతిన్న జాతీయ రహదారి 163 ని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ములుగు జిల్లాలో గోదావరినది వరదతో అదేవిధంగా జంపన్నవాగు వరదప్రవాహంతో పరిసర ప్రాంతాలకు సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని,

వాగులు, చెరువులు, కుంటల వద్దకు ప్రజలు వెళ్లకుండా ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని, గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని, రెవెన్యూ, పోలీస్, నీటి పారుదలశాఖ, మున్సిపల్ శాఖలు సమన్వయంతో కట్టుదిట్టమైన బందోబస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రధాన జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, గ్రామీణ రహదారులన్నీ క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని R&B & పంచాయతీ రాజ్ - అధికారులను ఆదేశించారు. వాహన రాకపోకలకు ఆటంకం కలుగకుండా, రహదారుల భద్రత, మరమ్మత్తుల తక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. రోడ్లలో గుంతలు ఉన్న చోట తాత్కాలిక మరమ్మత్తులు 48 గంటల్లోపు పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. చెరువు కట్టలు తెగిపోకుండా చర్యలు తీసుకోవాలని, నీరు సవ్యంగా కిందికి పారేలా మార్గాలు కల్పించాలని సూచించారు.

జిల్లాలోని చెరువులు, వాగులు భారీ వర్షాల కారణంగా పొంగిపొర్లే పరిస్థితి నెలకొంది, ప్రతి చెరువు కట్టవద్ద ఇంజనీర్లు, క్షేత్ర అధికారులు తనిఖీ చేయాలి. చెరువుల సమీప గ్రామాలకు ముందస్తు హెచ్చరికలు ఇవ్వాలి. చెరువుల కట్టలు, వాగులవద్ద ఇంజనీర్లు తనిఖీలు నిర్వహించి భద్రత చర్యలు చేపట్టాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఇంటింటికీ తిరిగి ఇంటెన్సివ్ జ్వర సర్వేలు నిర్వహించి, సత్వర చికిత్సఅందించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సామాజిక ఆరోగ్య కేంద్రాలలో అన్ని ముఖ్యమైన మందులు అందుబాటులో ఉండేలాచూసుకోవాలని అన్నారు. గర్భిణీ స్త్రీలు (EDD - Expected Date of Delivery) నిశితంగా పర్యవేక్షణలో ఉండాలని వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. ANMలు, ఆశా వర్కర్లు రోజువారీగా తండాలను సందర్శించి, గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరిస్థితుల నివేదికలను సమర్పించాలని తెలిపారు. గర్భిణీ స్త్రీలు ఎటువంటి ప్రమాద పరిస్థితిని ఎదుర్కోకుండా ముందస్తు వైద్య చర్యలు చేపట్టాలని ప్రతి కేసును నిశితంగా పర్యవేక్షించి, తల్లీబిడ్డల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని వైద్యాధికారులను అన్నారు. మునిసిపాలిటీ, గ్రామ పంచాయతీ ప్రాంతాలలో వర్షపు నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించే చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. దోమల పెరుగుదలను అరికట్టేందుకు ఆయిల్ బాల్స్ వదలడం, దోమల మందు పిచికారి నిర్వహించడం తప్పనిసరి అని ఆదేశించారు. అన్ని లోతట్టు ప్రాంతాలు, మురుగు కాలువలను వెంటనే శుభ్రం చేయాలని తెలిపారు. వాహకాల ద్వారా సంక్రమించే వ్యాధులను నివారించడానికి పారిశుద్ధ్య చర్యలను బలోపేతం చేయాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ముఖ్యమైన రహదారులు, జంక్షన్లలో గుంతలను వెంటనే పూడ్చే చర్యలు చేపట్టాలి. త్రాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని RWS & మిషన్ భగీరథ అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారుల ఇంజనీరింగ్ విభాగం డి ఈ కుమార స్వామి, తహసిల్దార్ సృజన కుమార్, సురేష్ బాబు, ఎంపి డి ఓ మమత, సుమనవాణి, ఎంపి ఓ శ్రీధర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదకర ప్రాంతాల్లో వాహనాలు వెళ్లకుండా చూడాలి



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా వాగులు, వంకలు ఉధృతంగా పొంగిపొర్లుతున్నాయి. రహదారులపై నీరు చేరిన చోట్ల, కాజ్‌వేల వద్ద ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలు, వాహనదారులు వెళ్లకుండా కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ మోరంచపల్లి వాగు ఇప్పటికే మొదటి ప్రమాద హెచ్చరిక వద్ద ప్రవహిస్తోందని, ఎగువ ప్రాంతాల నుండి వచ్చే వరద ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసి అవసరమైన జాగ్రత్తలు తప్పనిసరిగా చేపట్టాలని స్పష్టం చేశారు. రహదారులపై నీరు ప్రవహిస్తున్న మార్గాల్లో ప్రయాణాలు జరగకుండా తగిన నియంత్రణ చర్యలలో భాగంగా ట్రాక్టర్లు లేదా ఇతర వాహనాలను అడ్డు పెట్టాలని ఆదేశించారు. ప్రజలు, వాహనదారులు ప్రభుత్వం మరియు అధికార యంత్రాంగం ఇచ్చే సలహాలు, సూచనలు కచ్చితంగా పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో 9030632608 కంట్రోల్ రూముకు కాల్ చేయాలని సూచించారు. జాలర్లు చేపల వేటకు వెళ్లకుండా ఉండాలని కలెక్టర్ హెచ్చరించారు. అలాగే వర్షాల కారణంగా పశువులు ప్రమాదానికి గురికాకుండా చూడాలని, వాటిని మేత కోసం బయటకు వదలకుండా యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ రాహుల్ శర్మ ప్రజలందరినీ అప్రమత్తంగా ఉండాలని కోరుతూ ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని, చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణ నష్టానికి దారితీయొచ్చనని హెచ్చరించారు. గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉన్నట్లు తెలిపారు.

# విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

## శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, మెరుగైన వసతులు, విద్యా అందించేలా అధికారులు మరింత శ్రద్ధ వహించాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు సూచించారు. గురువారం రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్‌తో కలిసి రేగొండ మండలంలోని మహాత్మా జ్యోతి బా పూలే బాలికల వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటశాల, స్టోర్ రూమ్, కూరగాయల నిల్వలను పరిశీలించి, విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతను పరీక్షించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం హాస్టళ్లలో మంచి వసతులు, నాణ్యమైన భోజనం కల్పించడం కోసం ప్రభుత్వం మెనూ, డైట్ చార్జీలు పెంచినట్లు తెలిపారు. విద్యార్థుల సంక్షేమంలో రాజీ పడబోమని, వారి సంక్షేమం, విద్యాభివృద్ధి అత్యంత అవసరమని, అధికారులు ఈ అంశంలో నిర్లక్ష్యం చూపకూడదని పేర్కొన్నారు.



# ప్రతి ఉద్యోగి జీవితంలో పదవి విరమణ తప్పనిసరి

## జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్



మహబూబాబాద్ జిల్లా, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): గురువారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఏ. రవీందర్ రెడ్డి, పదవి విరమణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగి జీవితంలో ఉద్యోగ విరమణ తప్పనిసరి అని అన్నారు. సుదీర్ఘకాలం రవీందర్ రెడ్డి విద్యాశాఖలో సేవలందించి రాష్ట్రస్థాయిలో మహబూబాబాద్ జిల్లాను పదవ తరగతి పరీక్షలలో మొదటి స్థానంలో నిలబెట్టినందుకు ఆయన చేసిన కృషి అమోఘమైందన్నారు. పట్టుదల, క్రమశిక్షణ కు మారుపేరుగా ఆయన పని చేశారని గుర్తుకు చేశారు. అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టోప్పో, మాట్లాడుతూ విద్యాశాఖ బలోపేతానికి రవీందర్ రెడ్డి ప్రణాళికా ప్రకారం పని చేశారని క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరూ అదే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి హాజరైన తదితరులు రవీందర్ రెడ్డి చేసిన కృషి సేవలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు జెడ్పి సీఈవో పురుషోత్తం, బీసీ వెల్ఫేర్ అధికారి నరసింహస్వామి, ఏ డిఎస్ఎల్ఆర్ నరసింహమూర్తి, వేముల సురేష్ గ్రౌండ్ వాటర్, డీఎం సివిల్ సప్లై కృష్ణవేణి, మెప్మా పీడీ విజయ, విద్యాశాఖ సిబ్బంది అప్పారావు, చంద్రశేఖర్ ఆజాద్, శ్రీరాములు, విజయ కుమారి, సతీష్, లచ్చి రాము, బాలాజీ, నరసింహారావు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా విద్యా శాఖ పనితీరుపై సమీక్ష

## జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



మహబూబాబాద్ జిల్లా, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): గురువారం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రవీందర్ రెడ్డి, స్పెషల్ అధికారులు కెజివీబీ, ప్రోగ్రాం అధికారులు, మండల విద్యా శాఖ అధికారులు, ప్రధాన ఉ పాధ్యాలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు, తదితర సంబంధిత అధికారులతో విద్యా శాఖ పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జిల్లా విద్యాశాఖ పరిధిలోనీ అంటే జడ్పీహెచ్ఎస్, యూపీహెచ్ఎస్, కేజీవీబీలు, (898) పాఠశాలలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్దిని, విద్యార్థులు యొక్క అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు విద్యా శాఖ తీసుకుంటున్న చర్యలు, కార్యక్రమాల వివరాలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్, కాంప్లెక్స్ హెచ్ఎంలు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయుల ద్వారా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపి, ఎఫ్ఆర్ఎస్, పిల్లల లెర్నింగ్ అభ్యసన సామర్థ్యాల పై ఫోకస్ చేయాలని, హాజరు శాతం విద్యార్థులతో పాటు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయుల పెంచాలని, మధ్యాహ్న భోజనం ప్రభుత్వం సూచించిన ప్రకారం నాణ్యతగా అందించాలని, జిల్లాలోని పాఠశాలలో క్రీడా స్థలాలు ఉన్న చోట విద్యార్థులను క్రీడా లలో ప్రోత్సహించాలని సూచించారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, మాట్లాడుతూ పీఎం శ్రీ పాఠశాలలో ప్రభుత్వం కల్పించిన నూతల డిజిటల్ తరగతుల కార్యక్రమాలను, షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు,విద్యార్థుల తల్లిదండ్రులను కూడా ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు, అప్పారావు, చంద్రశేఖర్ ఆజాద్, సంతోష్, విజయ కుమారి, శ్రీరాములు, సతీష్, లచ్చిరాం, బాలాజీ, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీ పాఠశాలను తనిఖీచేసిన ఎంపీ కావ్య, కలెక్టర్, ఎమ్మెల్యే





వరంగల్ జిల్లా, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): ఖిలా వరంగల్ మండలం జక్కలొద్దిలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజులతో కలసి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు విద్యార్థుల హాజరు తో పాటు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నారా అని ఆరా తీశారు. తరగతి గదులను, వంటశాలను, స్టోర్ రూంను తనిఖీ చేశారు. టాయిలెట్స్, హాస్టల్ ప్రాంగణం, వంట చేసే ప్రాంతాలను, స్టోర్స్ లోని సరుకులను పరిశీలించారు. తాజా సరుకులను అందించాలని, హాస్టల్ లోపల, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థుల యోగక్షేమాలు, వారికి కావలసిన అవసరాలను అడిగి తెలుసుకుని విద్యార్థుల వివిధ సబ్జెక్టుల పఠన సామర్థ్యాన్ని పరిశీలించి, విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాల గురించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల విద్య ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. ఎలాంటి ఆటలు ఆడుతారని అడిగారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని తెలిపారు భవిష్యత్తులో మీరేం అవుతారని, మీ ఆశయం ఏమిటని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిత్వ వికాసం పెంపొందించే మంచి మాటలు చెబుతూనే.. జీవిత లక్ష్యం ఏమిటని కుశల ప్రశ్నలను సంధించి విద్యార్థుల నుండి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఇష్టపడి చదవాలని, మానసిక ఒత్తిడికి గురికావొద్దని సూచించారు. విద్యార్థుల భవిష్యత్ లక్ష్య సాధనకు ఇంటర్మీడియట్ దిక్సూచి అని తెలిపారు. ఈ సందర్భంగా భవనంపై నుండి వర్షపు నీరు కారుతున్నట్లు గమనించి వెంటనే ఇంజినీరింగ్ అధికారులతో మరమ్మతులు చేయయించాలని ఆదేశించారు. అనంతరం పాఠశాల భవనం పై నుండి రంగశాయిపేట దామెర చెరువును ఎంపీ, కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించి, చెరువు నీటి సామర్థ్యం, ఆయకట్టు, విస్తీర్ణం తదితర ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకుని చెరువు కట్ట బలోపేతానికి చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. అంతకుముందు ఎంపీ, కలెక్టర్ లు చిన్నవడ్డేపల్లి వెనుక భాగం కాశిబుగ్గలో చెరువును పరిశీలించి ఆక్రమణకు గురికాకుండా వెంటనే ఎఫ్ టి ఎల్ హద్దులు ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు వరద నీటితో జలమాయము కాకుండా నివారించేందుకు డ్రైన్స్ ఏర్పాటుకు తగు చర్య నిమిత్తం ప్రతిపాదనలు సమర్పించాలని జిడబ్ల్యూ ఎంసీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి రమేష్, నీటిపారుదల శాఖ ఈఈ శంకర్, డీఈ మధుసూదన్, తహసీల్దార్ నాగేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపల్ భిక్షపతి, జిడబ్ల్యూ ఎంసీ, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో మీసేవ సెంటర్ల ఆకస్మిక తనిఖీ

**నిర్ణీత రుసుము కంటే ఎక్కువ వసూలు చేస్తే చర్యలు**

**మండల కేంద్రంలో నూతన ఆధార్ సేవ కేంద్రం ఏర్పాటు**

**ఈ -డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్**



మల్లంపల్లి, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): మల్లంపల్లి మండల కేంద్రంలోని మీసేవ కేంద్రాలను ఈ – డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ ఆకస్మిక తనిఖీ చేశారు. మీసేవ కేంద్రాలను ప్రజలకు ఇప్పుడు అందుబాటులో ఉండి ESD గైడెన్స్ ప్రకారం మీ సేవ కేంద్రాన్ని నడపవలనని సూచించారు. ఆపరేటర్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి అన్ని రకాల మీసేవ, భూభారతి మరియు మిగతా ఆన్లైన్ సర్వీస్ లను ప్రజలకు అందించాలని సూచించారు. మీసేవ సెంటర్లో తప్పకుండా సిటిజెన్ చాప్టర్, భూభారతి కి సంబంధించిన ఫ్లెక్సీలు, మీసేవ లోగో, మరియు తాసిల్దార్, ఈడీఎం, పరిష్కారం కాల్ సెంటర్ల యొక్క ఫోన్ నెంబర్లు తప్పనిసరిగా ఉండవలెనని ఆదేశించారు. మల్లంపల్లి మండల ప్రజలు ఆధార్ సేవల గురించి ఇబ్బందులు పడుతున్న విషయం గుర్తించి కొత్త ఆధార్ సెంటర్ ని మల్లంపల్లి మండల కేంద్రంలో అతి త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. కళ్యాణ లక్ష్మి భర్త మరియు డెత్ సర్టిఫికెట్లు ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని మరియు మీసేవ ఆపరేటర్లు ప్రజల పట్ల సున్నితంగా ఉంటూ వారికి మీసేవ సర్వీసులను మరియు ఇతర అన్ని రకాల ఆన్లైన్ సేవలను అందించాలని ఆదేశించారు. నిర్ణీత రుసుము కంటే ఎక్కువ రుసుము దరఖాస్తుదారుడు నుంచి తీసుకున్నట్లయితే తప్పనిసరిగా అట్టి మీసేవ సెంటర్ పై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మీసేవ జిల్లా మేనేజర్ పోలోజు విజయ్ మరియు మీ సేవ సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగు లక్షకు పైగా ఆదాయం

**నెలనెలా స్థిరమైన ఆదాయం కూరగాయల సాగుతోనే సాధ్యం**



డోర్నకల్, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని వరి నుండి పంట మార్పిడి చేసి ఆయిల్ పామ్, ఉద్యాన పంటలు, మునగ, మల్బరీ సాగు చేయాలని జిల్లా ఉద్యానవన మరియు పట్టుపరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న అన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లా ఉద్యానవన మరియు పట్టుపరిశ్రమ శాఖ అధికారి డోర్నకల్ మండలంలోని ముల్కలపల్లి తదితర గ్రామాలలో సాగులో ఉన్న ఆయిల్ పామ్, అంతర పంటలు, పూల తోటలను సంబంధిత అధికారులతో పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారి రైతులకు సాగుపై పలు సాంకేతిక సలహాలు అందజేస్తూ రైతులు నికర ఆదాయం ఇచ్చే కూరగాయల పంటలను సాగు చేయాలని విజ్ఞప్తి చేశారు. పామాయిల్ తోటలలో మొదటి నాలుగు సంవత్సరాలలో అంతరపంటల కింద కూరగాయలు సాగు చేసే ప్రతీ రైతుకు ఎకరానికి రూ. 2,100/- అందించబడునని తెలిపారు. ప్రతి రైతు పొలం గట్ల మీద, పొలం చుట్టూ, పెరట్లో, ఆయిల్ పామ్, పండ్ల తోటలలో అంతర పంటలుగా, డాబాల మీద, ఇంటి ముంగిట రోజువారి అవసరాల నిమిత్తం అన్ని రకాల కూరగాయలను సాగు చేసుకోవాలన్నారు. కూరగాయల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు, నూతన రకాల సాగు, ప్రోట్రేస్లలో నారు పెంపకం, ఎత్తు మడులు, మల్చింగ్, బిందు సేద్యం, ఫర్టిగేషన్, వేప పిండి, ఆముదం పిండి వాడకం, వేప నూనె పిచికారి చేయటం, పసుపు రంగు అట్టల వాడకం, సిఫారసు చేసిన ఎరువులు వాడటం, పందిరిపై కూరగాయల సాగు, ట్రెల్లిస్ మెథడ్ లో టమాటా సాగు మొదలైన పద్ధతులు పాటించాలన్నారు. బోర్ల క్రింద ఆయిల్ పామ్, పండ్ల తోటలు, కూరగాయలు, పూలు, మల్బరీ, పలు రకాల ఉద్యాన పంటలు సాగు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి ఆర్. శాంతిప్రియ, రైతులు నాగేశ్వర రావు, కొండల్ రావు, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్ జెండర్లు ఆత్మగౌరవంతో జీవించాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**ప్రభుత్వం నుండి సంపూర్ణ సహకారం ఉంటుంది**



వరంగల్ జిల్లా, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): ట్రాన్స్ జెండర్లు ఆత్మగౌరవంతో జీవించేందుకు సంపూర్ణ సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. గురువారం కలెక్టరేట్లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలిసి టెండర్లతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్ ల సంక్షేమానికి చర్యలు చేపడతామన్నారు. ఆధార్ కార్డు లేని వారికి ఆధార్ కార్డు జారీ తో పాటు ఆధార్ కార్డులో పేరు, జెండర్ మార్చుటకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ట్రాన్స్ జెండర్ లందరికీ గుర్తింపు కార్డులను, రేషన్ కార్డులను అందజేస్తామన్నారు. ట్రాన్స్ జెండాలలో వికలాంగులకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు కి చర్యలు చేపడతామన్నారు. ట్రాన్స్ జెండర్లకు కార్మిక శాఖ ద్వారా లేబర్ కార్డులను అందిస్తామన్నారు.

ఎంజిఎం ఆసుపత్రిలో ట్రాన్స్ జెండర్ లకు వారంలో ఒకసారి చికిత్స జరిగేలా ప్రత్యేక ఓపిని కూడా ఏర్పాటు చేస్తామని కలెక్టర్ ఈ సందర్భంగా ట్రాన్స్ జెండర్ లకు తెలిపారు. స్వశక్తి మహిళా తరహాలో ట్రాన్స్ జెండర్లు సంఘాలు ఏర్పడితే వ్యాపార యూనిట్లకు ఏర్పాటు రుణాలు అందిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, జడ్పీ సీఈఓ, డి ఆర్ డి ఓ రామిరెడ్డి, డి డబ్ల్యు ఓ రాజమణి, ట్రాన్స్ జెండర్ల కమ్యూనిటీ అడ్వైజర్ ఈవి శ్రీనివాసరావు, ట్రాన్స్ జెండర్ ల రాష్ట్ర అధ్యక్షురాలు ఓరుగంటి లైలా, సభ్యులు అశ్విని రీమిష, పూర్ణిమ రెడ్డి, నక్షత్ర త్రిపుర, శాస్త్రి, జాహ్నవి, తదితరులు పాల్గొన్నారు

## ప్రతి ఒక్క రైతుకు యూరియా అందజేస్తాం

**ఎవరు ఆందోళన చెందవద్దు : జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**





ములుగు జిల్లా, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): జిల్లాలో వ్యవసాయ పంటలను పండిస్తున్న ప్రతి ఒక్క రైతుకు యూరియా బస్తాలను అందజేయడం జరుగుతుందని, రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయాన్ని జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్ తో కలిసి యూరియా స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బుధవారం 200 మంది రైతుల పేర్లను నమోదు చేసుకోగా వారికి ఈ రోజు యూరియా బస్తాలను అందజేయడం జరుగుతుందని, గురువారం పేర్లు నమోదు చేసుకున్న వారికి సాయంకాలం వరకు బస్తాలను అందజేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని రైతులందరికీ పూర్తిస్థాయిలో యూరియా బస్తాలను పంపిణీ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అపోహలను నమ్మి రైతులు ఆందోళన చెందవద్దని తెలిపారు. గురువారం వర్షం తగ్గుముఖం పట్టడం వల్ల ఒకేసారి రైతులందరూ కార్యాలయానికి చేరుకున్నారని, యూరియా బస్తాలు దొరికే పరిస్థితి లేదంటూ కొందరి తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని అన్నారు. రానున్న రోజులలో జిల్లాలోని రైతులందరికీ సరిపడ యూరియా బస్తాలను నిలువ చేస్తామని, దీనికి ప్రతి ఒక్క రైతు సహకరించాలని కోరారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నాణ్యమైన ఇటుకలు అందించడానికి జిల్లా కలెక్టర్ ప్రత్యేక చర్యలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మరియు ఉపాధి హామీ పథకం పనులకు నాణ్యమైన ఇటుకలను తక్కువ ఖర్చుతో అందించడానికి మణుగూరు మండలం దమ్మక్కపేట సమీపంలోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్) వద్ద ఫ్లై యాష్ వినియోగంతో నాణ్యమైన ఇటుకలు తయారీ విధానాన్ని గురువారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఇటుకల తయారీ విధానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. జిల్లాలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు మరియు ఉపాధి హామీ పథకం పనులలో అధిక నాణ్యత కలిగిన నిర్మాణ సామాగ్రి అందించడం ప్రధాన లక్ష్యం అని కలెక్టర్ తెలిపారు. ఫ్లై యాష్ వినియోగం ద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని, ఉత్పత్తి తర్వాత మిగిలిన వ్యర్థ పదార్థాన్ని సమర్థవంతంగా వినియోగించి ఇటుకలని తయారుచేసి ఉపయోగించవచ్చని చెప్పారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా విస్తృతంగా ఇటుకలను తయారు చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు మరియు ఉపాధి హామీ పథకం పనుల్లో అధిక నాణ్యత కలిగిన నిర్మాణ సామాగ్రి అందించడం ముఖ్యమైనది అని, ఇసుక, సిమెంట్, ఫ్లై యాష్ మరియు మట్టి (క్లే) మిశ్రమాలతో ఇటుకలు తయారీ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ ధరలో, నాణ్యమైన ఇటుకలను అందించవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు. వీటిపై విస్తృత ప్రచారం జరగడం ద్వారా జిల్లాలో పెద్ద ఎత్తున ఇటుకల తయారికి దోహదం అవుతుందని, తద్వారా లబ్ధిదారులు నేరుగా లాభపడగలరని తెలిపారు. ఆగస్టు 30న బీటీపీఎస్‌లో మూడు మిషన్ల ద్వారా వివిధ మిశ్రమాలతో నాణ్యమైన ఇటుకలను తయారుచేసే విధానంపై శిక్షణ మరియు అవగాహన కార్యక్రమం నిర్వహించడుతుంది అని, ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, సంబంధిత అధికారులు, ఔత్సాహికులు పెద్ద ఎత్తున పాల్గొని శిక్షణ పొందవచ్చని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీటీపీఎస్ చీఫ్ ఇంజనీర్‌లు, సూపర్డెంట్ ఇంజనీర్లు, పంచాయతీరాజ్ అధికారులు, ఉపాధి హామీ పథకం అధికారులు, గృహ నిర్మాణ విభాగ ఇంజనీర్లు, తాసిల్దార్, ఎంపీడీవో, ఏపీవో మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పీహెచ్సీ,జెడ్పీ హెచ్ఎస్ సందర్శించిన జిల్లా కలెక్టర్



మహబూబాబాద్ జిల్లా, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): గురువారం బయ్యారం మండలంలో విస్తృతంగా పర్యటించారు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి,లేబర్ రూమ్, వార్డులు, మందుల స్టోర్ గది, ఈడిడి, ఐపి, ఓపీ, సిబ్బంది హాజరు, మందుల స్టాక్ రిజిస్టర్లను, పరిసరాలను పరిశీలించారు. బయ్యారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని (8) హెల్త్ సబ్ సెంటర్లలో పరిధిలో షెడ్యూలు ప్రకారం వైద్య శిబిరాలు వైద్య కార్యక్రమాలు నిర్వహించాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, మాత శిశు మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకొని మందులు సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు, కేంద్రం పరిధిలోని ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ పరిశీలించాలన్నారు. జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు) ను సందర్శించి, విద్యార్థులకు అందిస్తున్న విద్యా,బోధనలు స్వయంగా పరిశీలించి వారిని అడిగి తెలుసుకున్నారు, పిల్లల యొక్క జ్ఞానాన్ని వెలికి తీయడం కోసం ఉపాధ్యాయులు నూతన పరిజ్ఞానం వినియోగించాలని, విద్యార్థిని, విద్యార్థులు యొక్క మానసిక, ఆరోగ్య, విద్య, అంశాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశుభ్రంగా అందించాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలని, తరగతి గదులు, కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, టాయిలెట్స్, పరిసరాలను సానిటేషన్ చేస్తూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బయ్యారం – నామాలపాడు రహదారి మధ్యలో ఉన్న లోలెవల్ కాజువే(బ్రిడ్జి)ని సందర్శించి వర్షాలు కురుస్తున్న సందర్భంలో తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు సూచనలు చేశారు. ప్రస్తుత వర్షాల నేపథ్యంలో బయ్యారం పెద్ద చెరువును సందర్శించారు. ప్రజలను చేపల వేటకు వెళ్లకుండా చూడాలని, చెరువు యొక్క స్థితిగతులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయ్, స్థానిక తహసిల్దార్ నాగరాజు, ఎంపీడీవో, సంబంధిత అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## భారీ వర్షాలు నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ఎస్సై దివ్య సాకపురం**



కొత్తపల్లి గోరి, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కొత్తపల్లి గోరి, మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు అధిక వర్షపాతం నమోదైన సందర్భంగా అత్యావ సరమైన సమయంలో తప్ప ఇంటిలో నుండి ఎవరు బయటికి రాకూడదు. వాగులు పొంగిపొర్లుతున్న సందర్భంలో వాగుల, చెరువులు, కుంటలు దగ్గరికి గాని ఎవరు కూడా వెళ్లకూడదని తెలియజేస్తున్నాము. గ్రామాలలో వర్షాలకు రోడ్లు చెరువులు కుంటలు తెగినట్లయితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వవలసిందిగా కోరుచున్నాము. ముఖ్యంగా మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకూడదని సూచిస్తున్నాము. అలాగే మండలంలోని ప్రతి గ్రామములో వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయిన సందర్భంగా గణపతి మండపాల దగ్గర జాగ్రత్తలు వహించాలని, నవరాత్రి ఉత్సవాల కమిటీలకు సూచించారు. గ్రామాలలో ఎవరైనా అనుమానస్పద వ్యక్తులు పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వవలసిందిగా తెలియజేస్తున్నాను.

## జిల్లాకి రెస్క్యూ బోట్ కేటాయింపు

**అగ్నిమాపక శాఖ కేంద్రానికి అప్పగించిన జిల్లా కలెక్టర్, కడియం శ్రీహరి**



జనగామ జిల్లా, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కి కేటాయించిన ఎస్ డి ఆర్ ఎఫ్ రెస్క్యూ బోట్ ను, ISUZE వాహనాన్ని కలెక్టర్ కార్యాలయం ఆవరణలో అగ్నిమాపక శాఖకి జిల్లా కలెక్టర్, శాసనసభ్యులు అందించారు. ఈ సందర్భంగా ఫైర్ అధికారులు బోటు వినియోగాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శింపజేసి తెలిపారు. భారీ వర్షాలకు వరద నీటిలో చిక్కుకున్న ప్రజలను, ప్రమాదవశాత్తు చెరువుల్లో జరిగే ప్రమాదాలలో ప్రజలను కాపాడేందుకు ఈ బోటు లను వినియోగించనున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షా లోమ్, జిల్లా ఫైర్ ఆఫీసర్ బి రేమండ్ బాబు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ బి సాయికుమార్, లీడింగ్ ఫైర్ మాన్ ఈ. ప్రభాకర్, డ్రైవర్స్ ఎస్ కే. రఫీ, జె. కోటేశ్వర బాబు, ఫైర్ మెన్స్ బి. కరుణాకర్, ఎం. కనకమల్లేశం, ఎల్. ఐలయ్య, బి. బాలకృష్ణ పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా పటిష్ట ఏర్పాట్లు

### ఎంపీ కావ్య, సిపి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా

వరంగల్ జిల్లా, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా పటిష్ట ఏర్పాట్లు చేయాలని

ఎంపీ డాక్టర్ కడియం కావ్య, సిపి ప్రీత్ సింగ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదాలు అధికారులను ఆదేశించారు. గురువారం వారు జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయితో కలసి వరంగల్ నగరంలోని చిన్న వడ్డేపల్లి చెరువు తదితర గణేష్ నిమజ్జన ప్రాంతాల్లో చేస్తున్న ఏర్పాట్లను క్షేత్ర స్థాయి లో పరిశీలించి సమర్ధవంతంగా నిర్వహించుటకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 5న నిమజ్జనానికి వచ్చే భక్తుల సౌకర్యార్ధం గణేష్ నిమజ్జమం సులభంగా జరుగుటకు నిమజ్జన ప్రాంతాల్లో బ్యారికేడింగ్ ను ఏర్పాటు చేయాలని, తగినంత క్రేన్లు, విగ్రహాల నిమజ్జనానికి సరిపోను తెప్పలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. కోట చెరువులో నిమజ్జనం నిషేదించబడినందున చిన్న వడ్డేపల్లి చెరువులో ఎక్కువ విగ్రహాలు వచ్చే ఆస్కారం ఉన్నందున నిమజ్జనం సమయంలో రద్దీని నియంత్రించడం, ప్రజల భద్రత వంటి అంశాలపై దృష్టి సారించాలని అధికారులకు వారు సూచించారు. ఆయా నిమజ్జన ప్రాంతాల్లో శానిటేషన్, తగినంత హై మాస్ట్ లైటింగ్, మంచినీటి సౌకర్యం, ఏర్పాట్లు ఉండేలా చూడాలని జిడబ్ల్యూ ఎంసీ అధికారులను ఆదేశించారు. జిడబ్ల్యూ ఎంసీ, నీటిపారుదల, విద్యుత్, అగ్నిమాపక పోలీసు శాఖల అధికారుల సమన్వయంతో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా చూడాలని అన్నారు. నిమజ్జనం ప్రశాంత వాతావరణం లో జరిగే విధంగా చూడాలని,



చెరువులో నీటి మట్టం ఎక్కువగా ఉన్నందున గజ ఈతగాళ్లు అందుబాటు లో ఉండేలా సంసిద్ధం గా ఉండాలని అన్నారు. అధికారులు సమన్వయంతో నిమజ్జన ప్రాంతాలలో ఏర్పాట్లను పూర్తి చేసి విధులను నిర్వర్తించాలన్నారు. నిమజ్జన ప్రదేశాలలో తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. వాహనాల రాకపోకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంతంగా నిమజ్జనం జరిగేలా అన్ని చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, డీసీపీలు రాయల ప్రభాకర్, షేక్ సలీమా, వరంగల్ సబ్ డివిజన్ ఎస్పి శుభం ప్రకాష్, రెవెన్యూ, జిడబ్ల్యూ ఎంసీ, నీటిపారుదల, విద్యుత్తు, పోలీసు , సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

### అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్



హనుమకొండ జిల్లా, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం, పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచడం, తదితర అంశాలపై విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల రోజువారి ముఖ గుర్తింపు హాజరు నమోదు, పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల నమోదైన విద్యార్థుల సంఖ్య వివరాలను డీఈవో వాసంతి, వివిధ మండలాల ఎంఈఓలు జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ విద్యార్థుల రోజువారి ముఖ గుర్తింపు హాజరు శాతాన్ని పెంచాలన్నారు. పాఠశాలకు రాని విద్యార్థుల గైర్హాజరుకు గల కారణాలను తెలియజేయాలన్నారు. పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఎంఈఓ లు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక దృష్టితో కృషి చేయాలన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయుల ఎఫ్ఆర్ఎస్ సరైన రీతిలో నమోదు చేయాలన్నారు. తరగతి గదిలో ప్రతి విద్యార్థి ని పరిశీలించి అభ్యసన సామర్థ్యాలను గురించి ఉపాధ్యాయులు అడిగి తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యకు సంబంధించిన పలు అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో వివిధ మండలాల ఎంఈవోలు, సమగ్ర శిక్షణ కోఆర్డినేటర్లు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 31వ తేదీలోగా వసతులు సమకూర్చాలి

### హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్

### జేఎన్ఎస్ స్టేడియంలో తాత్కాలిక స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాట్ల పరిశీలన



హనుమకొండ జిల్లా, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): హనుమకొండ లోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ తాత్కాలిక ప్రారంభానికి అవసరమైన సదుపాయాలను గురువారం కలెక్టర్ స్నేహ శబరీష్ క్షేత్ర స్థాయిలో పర్యటించి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేడియం ఆవరణలో ఉన్న హాస్టల్ భవనాలు, అవుట్ డోర్, క్రీడా మైదానాలను పరిశీలించి వాటిలో చేపట్టాల్సిన మరమ్మత్తులు, కల్పించాల్సిన సదుపాయాలను విద్యార్థులకు క్రీడా సదుపాయాలు ఈనెల 31వ తేదీలోగా ఏర్పాట్లు సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా డివైఎస్ఓ అశోక్ కుమార్ ను ప్రస్తుతం ఏర్పాటు చేసిన మౌలిక వసతుల గురించి చర్చించారు. అలాగే జేఎన్ఎస్ స్టేడియం ఆవరణలో విద్యార్థులకు హాస్టల్ వసతిలో ఉండాల్సిన సదుపాయల కల్పనకు, ఇండోర్, అవుట్ డోర్ క్రీడా సదుపాయాలు, పరికరాల ఏర్పాటుకు, అవసరమైన మరమ్మత్తులకు వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఇ.ఇ. ఆర్అండ్ బీ సురేష్, నరేందర్ రెడ్డి, కోచ్ లు తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జనం ప్రశాంతంగా జరగాలి

### ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి

### అధికారులు సమన్వయము గా పని చేయాలి

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ జిల్లా, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): గణేష్ నిమజ్జనం ఏర్పాట్లను డిసిపి రాజమహేంద్ర నాయక్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ లింగాల గణపురం మండలంలోని నెల్లుట్ల చెరువును గురువారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. చెత్త చెదారం తొలగిస్తున్న పనులను వేగవంతంగా చేపట్టాలన్నారు. ముందుగా గ్రావెల్ తో రోడ్డు నుండి నిమజ్జనం చేసే ప్రాంతం వరకు విస్తరణ చేపట్టాలని వినాయక విగ్రహాలను తీసుకొచ్చే వాహనాలు వేరే రహదారిలో తిరిగి వెళ్లే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. రోడ్లు భవనాల అధికారులు బారికేడ్స్ ఏర్పాటు చేయాలని, నిమజ్జనం జరిగే ప్రదేశం అంతా చదును చేయించాలని, విద్యుత్ శాఖ అధికారులు లైటింగ్ , సి.సి.కెమెరా ఏర్పాట్లు చేయాలని, మత్స్య శాఖ అధికారులు మత్స్యకారులకు విధులు కేటాయించి విగ్రహాలను నిమజ్జనం చేసేటప్పుడు సహాయకారులుగా సేవలందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గజ ఈతగాళ్లను కూడా అందుబాటులో సిద్ధం చేసుకోవాలన్నారు. నిమజ్జనంలో పాల్గొనే మత్స్యకారులకు గుర్తించే విధంగా టీషర్టు అందజేయాలన్నారు. విగ్రహాలను నిమజ్జనం చేసే క్రేన్లు రెండు ఏర్పాటు చేసుకోవాలని దానికి నలుగురు డ్రైవర్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. వైద్యశాఖ అధికారులు మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని డాక్టరు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. సెప్టెంబర్, 02 వ తేదీ వరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. నిమజ్జనం తిలకించేందుకు వచ్చే ప్రజలను నీటి వద్దకు రాకుండా బారి కేడ్స్ ఏర్పాటు చేయాలన్నారు. సంబంధిత అధికారులు సమన్వయంతో విధులను నిర్వహించాలని నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అధికారులు పక్కా ప్రణాళికతో చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ , నీటిపారుదల శాఖ ఎస్ ఈ సుధీర్ ఆర్డిఓ గోపిరామ్, జనగామ, లింగాల ఘన్పూర్ తాసిల్దార్లు హుస్సేన్, రవీందర్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు ఆర్ అండ్ బి డి.ఈ. అశోక్, మత్స్యశాఖ అధికారి రాణా ప్రతాప్, జిల్లా పంచాయతీ అధికారి స్వరూప, తదితర అధికారులు పాల్గొన్నారు.

# అదనపు ఆదాయం ఉపాధి అవకాశాలు పెంచేలా మోడల్ డెమో ఫామ్

### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): జిల్లాలో ప్రజలకు అదనపు ఆదాయం మరియు ఉపాధి అవకాశాలు పెంచేలా మోడల్ డెమో ఫామ్ ను రూపొందించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం బూర్గం పహాడ్ మండలం మొరంపల్లి బంజర గ్రామపంచాయతీ పరిధిలోని కెనాల్ పక్కన ఉన్న నీటిపారుదల శాఖ భూమిలో నూతనంగా ఏర్పాటు చేయు మోడల్ డెమో ఫామ్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మోడల్ డెమో ఫామ్ ను ఏ విధంగా అభివృద్ధి చేయాలి అనే దానిపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ డెమో ఫామ్ లో కూరగాయల సాగు, మట్టితో ఇటుకల తయారీ యూనిట్, వెదురు మరియు వాక్కాయ కంచె, క్వాయిల్ యూనిట్ షెడ్ మరియు సోలార్ డ్రైవర్ ఏర్పాటు చేయడంతో పాటు మునగ చెట్లు పెంచే విధంగా ప్రణాళికలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ మోడల్ డెమో ఫామ్ ద్వారా రైతులకు మాత్రమే కాకుండా మహిళలకు కూడా ఉపాధి అవకాశాలు కలగడం, సరికొత్త వ్యవసాయ పద్ధతులు పరిచయం కావడం ద్వారా అదనపు ఆదాయ వనరులు అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ బి ఎన్ ప్రసాద్, ఆర్ ఐ నరసింహారావు, ఎస్సార్ఎల్పి ఏఈ సందీప్, ఎంపీ ఓ బాలయ్య, ఏపీఓ విజయలక్ష్మి, ఏపీఎం హేమంతిని, పంచాయతీ సెక్రెటరీ భవాని, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# చేయూత పరికరాల కొరకు పిల్లల గుర్తింపు.. పక్కాగా చేపట్టాలి

### ఆదేశించిన అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్

జనగామ జిల్లా, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): గురువారం సమగ్ర శిక్షణ, ఆర్టిఫిషియల్ లింబ్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీ (ALIMCO ) సంయుక్తంగా నిర్వహించిన వికలాంగుల మధింపు అవసరమైన పరికరాల గుర్తింపు కార్యక్రమం Preston ఇన్స్టిట్యూట్ లో జరిగింది. అదనపు కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి పింకేష్ కుమార్ సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. ప్రత్యేక అవసరాల గుర్తింపు ప్రక్రియ ఎలా కొనసాగుతుంది అని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక అవసరాలు గల ఏ ఒక్క విద్యార్థి కూడా మిగిలిపోకుండా ఈ క్యాంపు ద్వారా ప్రతి ఒక్కరూ అర్హత కలిగినటువంటి పరికరాన్ని పొందాలని సూచించారు. కార్యక్రమం జరుగుతున్నటువంటి ప్రదేశాన్ని పర్యటించి ఇందులో పాల్గొంటున్న ప్రత్యేక అవసరాలు గల బాలబాలికలకు వారితో వచ్చిన తల్లిదండ్రులకు అవసరమైన కనీస సౌకర్యాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 150 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన బాలబాలికలు మదింపుకు హాజరుకాగా. వారి నుండి స్వీకరించినటువంటి దరఖాస్తులు, ధ్రువపత్రాల కాపీలు అలింకో ప్రతినిధులు స్వీకరించి తదుపరి పై కార్యాలయానికి పంపించనున్నారు. జిల్లాలోని విద్యావంతులు, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ అనురాధ జాదవ్, స్టాఫ్ నర్స్, preston పాఠశాల కరెస్పాండెంట్ బక్కా ప్రవీణ్, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి నర్సమ్మ , CMO వేముల నాగరాజు, ULLAS, TOSS ఇంచార్జ్ శంకర్ రావు, ఫిజియోతేరేపిస్టు ప్రసాద్, సురేఖ తదితరులు పాల్గొన్నారు.



# వరదల్లో రాష్ట్ర ప్రజలు, బీహార్లో రాష్ట్ర హెలికాప్టర్లు

### రేవంత్ రెడ్డి పాలనలో ఆంధ్ర ప్రాంతానికే లాభం

### కాంగ్రెస్ హామీలు గాలిలో, ప్రజల తీరని కష్టాలు

### సిర్పూర్ ప్రజల సమస్యలు తీరే వరకు వారితోనే ఉంటా

### స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయం పక్కా

### ప్రభుత్వంపై ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ తీవ్ర విమర్శలు

ఆసిఫాబాద్, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): కామారెడ్డి, సిరిసిల్ల, మెదక్ జిల్లాల్లో వరదల్లో చిక్కుకొని, రైతులు యువకులు ప్రాణాపాయ స్థితిలో ఉంటే, హెలికాప్టర్ల సాయంతో వారిని కాపాడకుండా, తెలంగాణ రాష్ట్రానికి చెందిన హెలికాప్టర్లను బీహార్ ఎన్నికల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం వాడుకున్నదని బి ఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. వరదల్లో చిక్కుకున్న ప్రజలను పరామర్శించడానికి బిఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీష్ రావు వెళితే, రాష్ట్ర ముఖ్యమంత్రి 2036 ఒలింపిక్స్ ఆటల నిర్వహణ కోసం, 42 శాతం రిజర్వేషన్లతో స్థానిక ఎన్నికల్లో గెలవడానికి సమీక్షలు నిర్వహిస్తున్నారని,ప్రజల ప్రాణాల కంటే ఎన్నికలే ముఖ్యమా? అంటూ రేవంత్ రెడ్డిని నిలదీశారు. ఈ రోజు సిర్పూర్ నియోజకవర్గంలోని బెజ్జూర్ మండలంలో స్థానిక సంస్థల నేపథ్యంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ ప్రయోజనాలు, ఆంధ్రోళ్లకు తాకట్టు పెట్టారని ఆరోపించారు. బనకచర్ల ప్రాజెక్టు ద్వారా తెలంగాణ నీళ్లు ఆంధ్రకు తరలిస్తున్నారని, కొడంగల్ నారాయణపేట ఎత్తిపోతల పథకం, ఫోర్త్ సిటీ కాంట్రాక్టర్ల పేరుతో ఆంధ్ర కాంట్రాక్టర్లు సిఎం రమేష్ వంటి వారికి కట్టబెడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని, ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు సొంత నియోజకవర్గంలో కూడా ముఖ్యమంత్రి ప్రారంభించలేదన్నారు. విద్యార్థులు స్కాలర్ షిప్స్ ఇవ్వకపోవడం వల్ల అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, రైతులు యూరియ కోసం ప్రభుత్వ ఆఫీసుల ముందు బారులు తీరుతున్నారన్నారు. బెజ్జూర్ మండలంలో ఒక మహిళ యూరియ కోసం వచ్చి స్పృహ తప్పిపడిపోయారని గుర్తుచేశారు. సిర్పూర్ లోని దిందా రైతులు హైదరాబాద్ వరకు పాదయాత్ర చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. దిందా రైతుల కష్టాలకు స్థానిక ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబే




కారణమన్నారు. అసెంబ్లీ వేదికగా సిర్పూర్ ప్రజలు 600 టేకు చెట్లు నరికారని,అటవీ అధికారులు ఏం చేస్తున్నారని నిలదీయడం వల్లనే,అటవీ అధికారులు పోడు వ్యవసాయం ఆపేశారని స్పష్టం చేశారు. సిర్పూర్ లో ఎన్ని కష్టాలు ఉన్నా ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదన్నారు. అటవీ శాఖ మంత్రిని,కేంద్ర అటవీశాఖ అధికారులను ఎందుకు కలవలేదో చెప్పాలని నిలదీశారు.

సిర్పూర్ లో చట్టబద్ధంగా ఎన్నికల ద్వారా లారీ అసోసియేషన్ అధ్యక్షులుగా తెలంగాణ ప్రాంత వ్యక్తి గెలిస్తే, ఆంధ్ర ప్రాంతానికి చెందిన కొందరు ఓర్చుకోలేక చట్ట విరుద్ధంగా రెబల్ అసోసియేషన్ ప్రారంభించి, తెలంగాణ నాయకుల మీద ఫేక్ కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై స్థానిక ఎస్పికి ఫిర్యాదు చేశామన్నారు. కేసిఆర్ పాలనలో రైతులు సంతోషంగా ఉన్నారని, రైతు బంధు, రైతు భీమా, కేసిఆర్ కిట్,దళిత బంధు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల ద్వారా ఇంటింటికి ఒక పథకం అందించారని గుర్తుచేశారు.

సిర్పూర్ ప్రజల బతుకులు మారేదాక, నియోజకవర్గం సంపూర్ణ అభివృద్ధి చెందేదాక, పిల్లలకు మంచి చదువులు అందించేందుకు, రైతులు కష్టాలు తీర్చేందుకు సిర్పూర్ లోనే ఉంటానని, సిర్పూర్ ప్రజలను వదిలి ఎక్కడికి వెళ్లేదిలేదన్నారు.

అందుకే రాబోయే స్థానిక ఎన్నికల్లో మళ్లీ కేసిఆర్ పార్టీని గెలిపించాలని కోరారు. స్థానిక ఎన్నికల గెలుపు ద్వారానే కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలన్నారు.



## కేసుల విచారణ.. తీర్పుల్లోనూ
# గడువు విధించాలి!

మన న్యాయవ్యవస్థ ఇంకా బ్రిటిష్ కాలంనాటి పరిస్థితులకు అనుగుణంగానే సాగుతోంది. న్యాయ వ్యవస్థతో పాటు చట్టాలు, శిక్షల్లో భారతీయాకరణ జరగాల్సి ఉంది. కొత్త చట్టాలు ప్రవేశ పెట్టిన దరిమిలా దీనిపై చర్చ చేయాలి. రాజకీయ నాయకుల నేరాలకు సంబంధించి ఇటీవల పార్లమెంటులో రాజ్యాంగ సవరణ ప్రవేశ పెట్టిన దరిమిలా అనేక అంశాలపై చర్చించాలి. అలాగే గవర్నర్లు, రాష్ట్రపతి బిల్లుల ఆమోదంలో కాల పరిమితి విధించిన సుప్రీం కోర్టు, తన విషయంలోనూ పరిమితి విధించుకోవాలి. ఏళ్ల తరబడి కేసులు నడవడం, తీర్పులు వచ్చే సరికి కొందరు మరణించడం జరుగుతోంది. ఒక్కో కేసు పరిమిత కాలంలో ముగించేలా సంస్కరణలు రావాలి. ఏ కేసయినా ఏడాదికి మించకుండా చూడాలి. సిబిఐ, ఇడి దాడుల కేసుల్లో కూడా సత్వర విచారణ జరగడం లేదు. ఎపికి సంబంధించి వివేకా హత్య కేసు ఆరేడేళ్లుగా ఎటూ తేలలేదు. సిబిఐ విచారణ జరిపినా దోషులు ఎవ్వరన్నది తేల్చలేదు. ఇకపోతే జగన్ ఐదేళ్లు బెయిల్ మీద ఉంటూ పాలన చేశారు. అనేక కేసులు ఇంకా కొలిక్కి రాలేదు. కెసిఆర్ అవినీతిపై విమర్శలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ ఎలూ తేల్చలేదు. సత్వరంగా కేసులను విచారించి దోషులకు కేసు పడేలా చేయాలి. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేసులో పరస్పర విరుద్ధ తీర్పులు ఇవ్వడమే గాకుండా 17 ఏళ్లుగా కోర్టులో నానింది. రాజకీయ నాయకుల కేసుల విషయంలో మరీ త్వరగా తీర్పులు రావాలి.ఎందుకంటే పెరుగుతున్న నేరాలు, కొత్తకొత్త మోసాలు, ఐటి మోసాలు, అత్యాచారాలు వంటి వాటిని పరిశీలించి చట్టాల ను మార్పు చేసుకోవాల్సి ఉంది. హత్యాచారం ఘటనలు మళ్లీ మ్లీ జరుగుతూనే ఉన్నాయి. అత్యాచారాలపై ప్రజల్లో భయం లేకుండా పోతున్నది. లిక్కర్ కేసులో సత్వర విచారణ సాగడం లేదు. నేతల అవినీతిపైనా విచారణ సాగడం లేదు. ఇప్పటివరకు పనిచేసిన న్యాయమూర్తులు ఆయా సందర్భాల్లో తమ విలువైన సూచనలు చేశారు. వాటిని సలహాలుగా తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగాలి. ప్రజలకు ఏంచేస్తే సత్వర న్యాయం అందుతుందో ఆలోచించాలి. అవసరమైతే మాజీ ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తుల సలహాలు తీసుకోవాలి. ప్రతిపేదవాడికి న్యాయం అందించడమే న్యాయమూర్తి ప్రధాన లక్ష్యం కావాలి. దేశంలో న్యాయం పట్ల జరుగుతున్న ఆలస్యాన్ని గుర్తించి సత్వర న్యాయం అందేందుకు అసవరమైన చర్యలను చేపట్టాలి. నిర్ణీత కాలంలోగా న్యాయ విచారణలు, తీర్పులు వచ్చేలా నట్టబద్దం చేసుకోవాలి. ఇదే సందర్భంలో పెండింగ్ కేసులు సమస్యగా మారాయని కూడా గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలి. ప్రతి తీర్పులోనూ ప్రజలకు న్యాయం జరిగిందన్న భావన కలగించాలి. రాజకీయ నాయకుల కేసుల విషయంలో త్వరగా విచారణ జరిపి శిక్షలు వేస్తే మంచిది. కోర్టు తీర్పులను అమలు చేయని ప్రభుత్వాలపై కఠిన చర్యలకు అవకాశం ఉండాలి. ఇటీవల పలువురు సుప్రీం చీఫ్ జస్టిస్‌లుగా పనిచేసిన వారు న్యాయవ్యవస్థలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టారు. ఇవన్నీ కూడా పేదలకు సత్వర న్యాయం అందాలన్న తపనతో చేసినవే తప్ప మరోటి కాదు. భారత న్యాయ వ్యవస్థ సాధారణ ప్రజలకు ఎంతో దూరంలో నిలిచిందన్న ఆరోపణల్లో వాస్తవాలను గుర్తించాలి. ఇప్పటికీ కోట్ల మంది అణగారిన వర్గాల ప్రజలకు న్యాయ సహాయం అవసరం ఉంది. తమకు అన్యాయం జరిగిందని భావించిన ప్రతి వారూ కోర్టులకు వెళ్లడం లేదు. ఎందుకంటే కోర్టులకు వెళితే తేలేదేమీ లేకపోగా అనవసర కాలయాపన, డబ్బులు దండగ అన్న భావనలో ప్రజలు ఉన్నారు. అవసరమైన వెంటనే న్యాయ వ్యవస్థను ఆశ్రయించడానికి ఇంకా వారు జంకుతూనే ఉన్నారు. న్యాయవ్యవస్థ రాజ్యాంగబద్ధమైన విధులు నిర్వర్తి స్తున్నప్పటికీ నిర్ణీత కాలవ్య వధిలో కోర్టుల్లో కేసులు తేలడంలేదు. తీర్పులు వచ్చాక అమలు కావడం లేదు.అంబేడ్కర్ మహాశయుడి ఆలోచనలకు అందని విధంగా మన రాజకీయాలు మారుతున్నాయి. సామాన్యులకు న్యాయం అందకుండా పోతోంది. నిరంతరం రాజకీయ కేసులు తప్ప సామాన్యుల పక్షాన న్యాయవ్యవస్థ బలంగా నిలబడడం లేదు. నేటికీ ఎందరో చేయని నేరాలకు జైళ్లలో మగ్గుతున్నారు. ఇలాంటి వారిని ఎలా బయటకు తీసకుని వస్తారన్నది కూడా ముఖ్యం. అలాగే ఎలాంటి కేసునైనా కనీసం 3నెలల్లో ముగించి తీర్పును ఇచ్చేలా కఠిన చట్టాలను అమలు చేయాలి. తెలంగాణలో పలువురు ఎమ్మెల్యేలపై అనర్హత కేసును మూడు నెలల్లో తేల్చాలని సుప్రీం ఆదేశించింది. నిజానికి ఎన్నికలయిన ఓ నెలరోజుల్లోగా ఎన్నికైన ప్రజాప్రతినిధులపై ఏవైనా కేసులు ఉంటే తేల్చేయాలి. ఏళ్లతరబడి కేసునలు నాన్చేయడం వల్ల ఐదేళ్ల పుణ్యకాలం గడిచిపోతోంది. చిట్టచివరకు ఎన్నికల ముందు తీర్పులు వ్యతిరేకంగా వచ్చినా చేయగలిగేది ఏమీ లేదు. కనుక వీటిపైనా దృష్టి సారించాల్సి ఉంది. న్యాయవ్యవస్థలో సమూల మార్పులు జరగాలని గుర్తు చేసుకోవాలి. ప్రధానంగా స్థానిక భాషల్లో కోర్టు కార్యకలాలపాలు సాగాలి. కోర్టుల్లో న్యాయ చర్చలను స్థానిక భాషల్లో చర్చించేలా చట్టం చేసుకోవాలి. గతంలో ప్రధాని మోడీ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. కాబట్టి ఇప్పుడీ విషయంపై చర్చించాల్సిన అవసరం ఉంది. ప్రజలకు అర్థంకాని భాషలో కాకుండా ప్రజలకు అర్థం అయ్యే భాషలో న్యాయచర్చలు సాగాలి. కోర్టుతీర్పులు స్థానిక భాషల్లో విడుదల చేయాలి. పాలకులు పేదలకు న్యాయన్ని చేరువ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలి. అనేక సంస్కరణలు తీసుకుని వచ్చామని చెబుతున్న ప్రధాని మోడీ ఈ న్యాయవ్యవస్థలో ఉన్న లోటుపాట్లను గుర్తించి తక్షణ చర్యలకు పూనుకోవాలి. పార్లమెంట్ వేదికగా దీనికి శాశ్వత పరిష్కారం చూపాలి. వివేకానందరెడ్డి హ్యాతకేసు, కోడికత్తి కేసులు తీసుకుంటే ఎంతలా జాప్యం జరుగుతుందో చూడవచ్చు. పోలీసుల విచారణలో జాప్యం.. కోర్టుల్లో జాప్యం వంటివన్నీ పోవాలి. కేసు తీవ్రతను బట్టి సత్వర విచారణ, తీర్పులు రావాలి. ఇందుకు అవసరమైతే.. మనదేశం వేల ఏళ్లుగా అనుసరించిన రాజ్యాంగ వ్యవస్థలను, న్యాయవ్యవస్థలను, ఇతర దేశాల్లో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలి. నిజానికి కోర్టులు, రాజ్యాంగం పట్ల ప్రజలకు సరైన అవగాహన లేదు. ప్రజలను కోర్టులకు చేరువ చేయడం రాజ్యాంగ విధి కావాలి. రాజ్యాంగం అంటే పాలకులకు సంబంధించిన వ్యవహారంగా ఉండరాదు. న్యాయ వ్యవస్థపై అవగాహన కల్పించేందుకు, విశ్వాసం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి. ప్రజలకు న్యాయవ్యవస్థ పట్ల విశ్వాసం కలిగించాలి. లోకల్ కోర్టులను పెంచి సత్వర న్యాయం కలిగించాలి. మన న్యాయవ్యవస్థ, ప్రొసీడింగ్స్ ఇంకా ఆంగ్లేయులనాటి విధానాలనే అవలంబిస్తోందన్న ఆరోపణల నుంచి బయటపడి పటిష్టమైన న్యాయ చట్టాలను రూపొందిం చాలి. దీనిని ప్రాతిపదికగా తీసుకుని మన పాలకులు న్యాయవ్యవస్థలో సంస్కరణలకు శ్రీకారం చుట్టాలి. సత్వర న్యాం అందడం కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి. ఎలాంటి కేసయినా ఓ యేడాదిలోగా ముగిస్తే మంచిదన్న భావనలో విచారణలు సాగాలి.

# వరద బాధితులను ఆదుకుంటాం

- పంట నష్టపోయిన రైతులకు అండగా ఉంటాం
- కేంద్రం నుంచి తక్షణ సాయం పొందేలా చర్యలు
- వరద నష్టంపై వెంటనే నివేదికలు రూపొందించాలి
- మెదక్‌లో సమీక్షించిన సిఎం

**మెదక్,ఆగస్ట్ 28:** వరదల్లో చిక్కుకొని మృతిచెందిన బాధిత కుటుంబాలకు, పంట నష్టపోయిన రైతులకు సహాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీనిచ్చారు. పరిహారానికి సంబంధించి పూర్తి నివేదికలను సిద్ధం చేయాలని ఫోన్‌లో చీఫ్ సెక్రటరీకి ఆదేశాలు ఇచ్చారు. వర్షాలు-వరదలపై మెదక్ ఎస్పీ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. కేంద్రం నుంచి అత్యవసరంగా నిధులు కోరేలా రిపోర్ట్ తయారు చేయాలని జిల్లా అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. వరద తగ్గగానే పంట నష్టంపై క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక తయారు చేయాలని ఆజ్ఞాపించారు. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల భవనాలను గుర్తించి, వాటిల్లో ఉన్న విద్యార్థులను వేరే చోటకు మార్చాలని సూచించారు. రామాయంపేట ఎస్సీ మహిళా డిగ్రీ కళాశాలకు పక్కా భవనం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.



వర్షాలు, వరదల నేపథ్యంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరదల్లో నష్టపోయిన వారిని ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుం దని హామీనిచ్చారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క కూడా వరదలపై సమీక్షించారు. కామారెడ్డిలో జరిగింది ప్రకృతి విపత్తని, వర్షాలు తగ్గగానే పంట నష్టాన్ని అంచనా వేసి అందరినీ ఆందుకుంటామని అన్నారు. నష్టంపై సీఎంకు నివేదిక ఇస్తామని, కేంద్రం కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రెండు, మూడ్రోజుల్లో రవాణా మెరుగుపరుస్తామని మంత్రి సీతక్క తెలిపారు. కాగా, వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి బృందం పెద్దపల్లి, మెదక్ జిల్లాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. కామారెడ్డిలోనూ పర్యటించాల్సి ఉండగా.. చివరి నిమిషంలో పర్యటన రద్దు అయ్యింది.



# 20 ఏళ్లలో ఎప్పుడూ ఇంతటి వర్షం చూడలేదు

## సిద్దిపేటలో భారీ వర్షంతో కాలనీల్లోకి నీరు

## ముంపుప్రాంతాల్లో హరీష్ రావు పర్యటన

**సిద్దిపేట, ఆగస్టు 28:** గత 20 సంవత్సరాలలో సిద్దిపేటలో ఇలాంటి వర్షం ఎప్పుడు పడలేదని బిఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. సిద్దిపేట పట్టణంలో కురిసిన వర్షాలకు కోమటి చెరువు నాల వరద ఉదృతికి గురైన ముంపు ప్రాంతాలు శ్రీనగర్ కాలనీ, శ్రీనివాస్ నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. క్షేత్రస్థాయి లో పర్యటించి చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ను, మున్సిపల్ అధికారులను హరీష్ రావు ఆదేశించారు. సిద్దిపేట పట్టణ కేంద్రంలో లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. తొగుట మండలంలో 20 సెంటీమీటర్ల వర్షం పడి ప్రజలు ఇబ్బంది పడ్డారని బిఆర్ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు తెలిపారు. ఈ సందర్భంగా హరీష్ రావు సిద్దిపేటలో మీడియాతో మాట్లాడుతూ.. భారీ వర్షం వల్ల సిద్దిపేటలో పలు కాలనీలు జలమయమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేటలో వచ్చిన వరదను తగ్గించడానికి నర్సాపూర్ చెరువుకు ఒక మీటర్ తొలిగించామని, నర్సాపూర్ చెరువు నీటిని శనిగరం వాగు, మందపల్లి వాగు వైపు నీళ్లు మళ్లించామని తెలియజేశారు. భవిష్యత్తులో వరద వచ్చినపుడు ఎలా చర్యలు చేపట్టాలో ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళికలు చేయాలని సూచించడం జరిగిందని, ప్రజలు కూడా సహకరించాలని నాలాలు కబ్జాలు చేసి సెట్ బ్యాక్ లేకుండా ఇల్లు కట్టడం వల్ల ఇలాంటి ఇబ్బందులు వస్తాయని హెచ్చరించారు. నాలాలు కబ్జాలు చేసి ఇల్లు నిర్మించుకున్నాక వరదలు వస్తే బాధపడితే ఎలా? అని లోతట్టు- ప్రాంతాలలో తక్కువ ధరకు వస్తున్నాయని ఇల్లు నిర్మాణం విషయంలో ప్రజలు ఆలోచించు కోవాలని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు సెట్ బ్యాక్ లేకుండా ఇల్లు నిర్మించుకోకూడదని చెప్పారు. లోతట్టు- ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మున్సిపల్ అధికారులు ఎప్పటికప్పుడు పరవేక్షణ చేయాలని సూచించారు. ప్రజలు ఆందోళన చెందోద్దు అని హరీష్ రావు తెలిపారు.

# ప్రతి జంటా ముగ్గురు పిల్లలను కనాలి

## జనాభా తగ్గకుండా కాపాడుకోవాలి

## ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్



**న్యూఢిల్లీ,ఆగస్ట్28 :** ప్రతి భారతీయ జంటకు ముగ్గురు పిల్లలు ఉండాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. ప్రతి మహిళకు 2.1 మంది పిల్లలు అనే ప్రత్యామ్నాయ జనన రేటును ఆయన వెల్లడించారు. గురువారం ఆయన ఢిల్లీలో విలేకరుల సమావేశంలో జనాభా అంశంపై మాట్లాడారు. మూడు కంటే తక్కువ జనన రేటు ఉన్న సమాజాలు నెమ్మదిగా అంతరించిపోతున్నాయని నిపుణులు చెబుతున్నారని భగవత్ అన్నారు. కావున, మూడు కంటే ఎక్కువ జనన రేటును కొనసాగించాలని, ఇది అన్ని దేశాలలో జరుగుతోందని మోహన్ భగవత్ అన్నారు. సరైన వయస్సులో వివాహం చేసుకుని, ముగ్గురు పిల్లలను కనడం వల్ల తల్లిదండ్రులు, పిల్లలు ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు చెబుతున్నారు. ముగ్గురు తోబుట్టువులు ఉన్న ఇళ్లలోని పిల్లలు చక్కని నడవడిక నేర్చుకుంటారు. భవిష్యత్తులో వారి కుటుంబ జీవితంలో ఎటువంటి ఆటంకాలు ఉండవు. వైద్యులు చెప్పింది ఇదే... మన దేశ జనాభా 2.1 జనన రేటును సిఫార్సు చేస్తోంది. ప్రతి భారతీయ జంట, దేశ ప్రయోజనాల దృష్ట్యా ముగ్గురు పిల్లలను కనడానికి ప్రయత్నించాలని అయితే, దీనిలో ఒక ఆందోళనకరమైన అంశం ఉంది. జనాభా ఒక వరం కావచ్చు లేదా భారం కూడా కావచ్చు. అందరికీ ఆహారం పెట్టాలి. అందుకే జనాభా విధానం ఉంది. కావున, జనాభా నియంత్రణలో ఉండేలా చూసుకోవడానికి అదే సమయంలో తగినంతగా ఉండేలా చూసుకోవడానికి ప్రతి కుటుంబానికి ముగ్గురు పిల్లలు ఉండాలి. కానీ అంతకంటే ఎక్కువ మంది ఉండకూడదు. వారి పెంపకం సరిగ్గా ఉండేలా చూసుకోవడానికి ఇది అందరూ అంగీకరించాల్సిన విషయం అని అన్నారు.

# చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకోవాలి

## వరదనష్ట బాధితులకు తోణ సాయం అందించాలి

## పునరావాస బాధితులను పరామర్శించిన రఘునందన్

**మెదక్,ఆగస్ట్28:** వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. వరదల్లో నష్టపోయిన వారిని కూడా ఆదుకోవాలన్నారు. విద్యుత్ పునరుద్ధరణ పనులు తోణం చేపట్టాలన్నారు. మెదక్‌లోని జీకేఆర్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో వరద బాధితులను పరామర్శించిన అనంతరం మాట్లాడారు. పోచారంలో ఇద్దరు వ్యక్తులు గల్లంతయ్యారు. వారిలో ఒకరి మృతదేహం లభ్యమైంది.. మరొకరి కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు గాలిస్తున్నాయి. మెదక్‌జిల్లాలో పునరుద్ధరణ పనుల కోసం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వివేక్ రూ. కోటి వరద సాయం ప్రకటించారు.అనేక మంది ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులయ్యారు. లోతట్టు ప్రాంతాలన్నీ ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. విపత్తు సాయం పెంచాలని, మృతుల కుటుంబాలకు రూ.50లక్షల చొప్పున పరిహారం, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేసారు. రాష్ట్ర ప్రభుత్వం హెలికాప్టర్ పంపడంలో ఆలస్యం కావడం వల్లే ఆ ఇద్దరు చనిపోయారని గ్రామస్థులు బాధపడుతున్నారు.



# భారీ వర్షాలతో రోడ్లకు గండ్లు

## తక్షణ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి : మంత్రి కోమటిరెడ్డి

**హైదరాబాద్,ఆగస్ట్28:** భారీ వర్షాలతో పలుచోట్ల రోడ్లకు గండ్లు పడ్డందున, రోడ్లు దెబ్బతిన్న ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, తక్షణ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆర్ అండ్ బి అధికారులను అలెర్ట్ గా ఉండాలని ఆదేశించారు. గురువారం నాడు ఆర్ అండ్ బి అధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్ర స్థాయి పరిస్థితులను ఆర్ అండ్ బి శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి, సిరిసిల్ల, నిర్మల్ జిల్లాల్లో పరిస్థితులపై సమీక్షించిన మంత్రి, కాజ్ వే లు, కల్వర్టులు, బ్రిడ్జిలు, కోతకు గురైన రోడ్ల వివరాలు అధికారులను అడిగితెలుసుకున్నారు. అదేవిధంగా ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా చూడాలని, తెగిన రోడ్లు, కల్వర్టుల వద్ద వర్షాలు తగ్గుముఖం పట్టగానే తాత్కాలిక మరమ్మతులు చేపడతామన్నారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపు చేయాలని అధికారులకు సూచించారు. ప్రాణ నష్టం జరగకుండా పోలీస్, ఎలక్ట్రిసిటీ-, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖలతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. డైన రోడ్లు, వంతెనలకు సంబంధించి శాశ్వత నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఆర్ అండ్ బి హెడ్ ఆఫీస్ లో కంట్రోల్ సెంటర్ కు వస్తున్న ఫిర్యాదులు,




సమాచార వివరాలపై మంత్రి ఆరా తీయగా.. స్టేట్ రోడ్స్ సి.ఈ ఆధ్వర్యంలో షిఫ్టుకు నలుగురు చొప్పున 24 గంటలు మానిటరింగ్ చేస్తున్నట్లు- చెప్పారు. మొత్తంగా 206 చోట్ల సిడి వర్క్స్ దెబ్బతిన్నాయని, రోడ్లు, కాజ్ వే,మైనర్ బ్రిడ్జిలు, కల్వర్టులు తాత్కాలికంగా, శాశ్వతంగా పునరుద్ధరించాలని ప్రాథమికంగా గుర్తించినట్లు- పేర్కొన్నారు. తాత్కాలిక పునరుద్ధరణకు 53.76 కోట్లు- వరకు ఖర్చు అవుతుందని, శాశ్వత పునరుద్ధరణ కోసం 1157.46 కోట్లు- అవసరమవుతాయని అంచనా వేసినట్లు- పేర్కొన్నారు.


# అహ్మదాబాద్‌లో 2030 కామన్వెల్త్ గేమ్స్!

## అంతర్జాతీయ క్రీడా వేదికగా భారత్

## యూనియన్ కేబినెట్ మీటింగ్‌లో గ్రీన్ సిగ్నల్



భారతదేశం మరోసారి అంతర్జాతీయ క్రీడా వేదికగా నిలవబోతోంది. 2030 కామన్వెల్త్ గేమ్స్‌ను నిర్వహించేందుకు హోస్ట్ చేయడానికి భారత్ సిద్ధమవుతోంది. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన యూనియన్ కేబినెట్ మీటింగ్‌లో బిడ్ వేసే ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. బిడ్ గెలిస్తే అహ్మదాబాద్‌లో ఈ గ్రాండ్ ఈవెంట్ జరగనుంది. అది కూడా గుజరాత్ సర్కార్‌కి గ్రాంట్ ఇన్ ఎయిడ్‌తో సహా అన్ని సపోర్ట్‌లతో జరగనుంది. ఒకవేళ మన బిడ్ గెలిస్తే, హోస్ట్ కొలాబరేషన్ అగ్రిమెంట్ (%ఎజూ%) కూడా సైన్ అవుతుంది. బిడ్ ఆమోదం పొందితే, గుజరాత్ ప్రభుత్వానికి సహకార ఒప్పందం, గ్రాంట్%-%ఇన్%-%ఎయిడ్ మంజూరు చేయడానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కామన్వెల్త్ క్రీడల్లో 72 దేశాల నుంచి అథ్లెట్లు పాల్గొననున్నారు. ఈ క్రీడల సమయంలో దేశాన్ని పెద్ద సంఖ్యలో అథ్లెట్లు, కోచ్‌లు, సాంకేతిక అధికారులు, పర్యాటకులు, మీడియా వ్యక్తులు సందర్శించనున్నారు. దీంతో స్థానిక వ్యాపారాలకు ప్రయోజనం చేకూరడంతో పాటు ఆదాయం కూడా లభించనుంది.




అహ్మదాబాద్?లో వరల్డ్ క్లాస్ స్టేడియంలు, అత్యాధునిక ట్రైనింగ్ ఫెసిలిటీస్, స్పోర్ట్స్ పట్ల ఉన్న ప్యాషన్ సహా అనేకం ఉన్నాయి. నరేంద్ర మోదీ స్టేడియం కూడా ఇక్కడే ఉంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద స్టేడియం. 2023లో ఐసీసీ క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్‌ని సక్సెస్‌ఫుల్‌గా హోస్ట్ చేసిన ఈ స్టేడియం, కామన్వెల్త్ గేమ్స్ 2030కి కూడా రెడీగా ఉంది. ఇక్కడ అథ్లెట్లు, కోచ్‌లు, టెక్నికల్ ఆఫీసర్లు, టూరిస్టులు, మీడియా పర్సన్స్ సహా అందరూ ఒక చోట అందుబాటులో ఉంటారు. "భారతదేశంలో కామన్వెల్త్ గేమ్స్‌ని నిర్వహించడం పర్యాటకాన్ని పెంచడంతో పాటు ఉద్యోగాలను సృష్టించడం, లక్షలాది మంది యువ అథ్లెట్లకు స్ఫూర్తినిచ్చే శాశ్వత ప్రభావాన్ని చూపుతుంది. అంతేకాకుండా స్పోర్ట్స్ సైన్స్, ఈవెంట్ ఆపరేషన్స్, మేనేజ్‌మెంట్, లాజిస్టిక్స్, ట్రాన్స్‌పోర్ట్ కోఆర్డినేటర్లు, బ్రాడ్‌కాస్ట్, మీడియా, %ఐు%, కమ్యూనికేషన్స్, పబ్లిక్ రిలేషన్స్, ఇతర రంగాలలో కూడా పెద్ద సంఖ్యలో నిపుణులు అవకాశాలను పొందుతారు" అని కేంద్ర మంత్రివర్గం తెలిపింది. ఇండియాతో పాటు, నైజీరియా, మరో రెండు దేశాలు కూడా 2030లో బహుళ-క్రీడా మహోత్సవాన్ని నిర్వహించడానికి ఆసక్తిని వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. 2030 కామన్వెల్త్ క్రీడలకు తుది ఆతిథ్య దేశాన్ని నవంబర్ చివరి వారంలో గ్లాస్గోలో జరిగే కామన్వెల్త్ స్పోర్ట్ జనరల్ అసెంబ్లీ నిర్ణయిస్తుంది. ఈ కామన్వెల్త్ గేమ్స్‌లో 72 దేశాల నుంచి అథ్లెట్లు పాల్గొంటారు. ఇది కేవలం స్పోర్ట్స్ ఈవెంట్ మాత్రమే కాదు, ఒక గ్లోబల్ సెలబ్రేషన్ అని కూడా చెప్పవచ్చు. ఈ ఈవెంట్ వల్ల లోకల్ వ్యాపారాలకు కూడా మేలు జరుగుతుంది. హోటల్స్, రెస్టారెంట్లు, టూరిజం... అన్నీ బూస్ట్ అవుతాయి. అంతేకాదు, ఈ ఈవెంట్ వల్ల ఉద్యోగ అవకాశాలు కూడా పెరుగుతాయి. స్పోర్ట్స్, సైన్స్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, లాజిస్టిక్స్, బ్రాడ్‌కాస్ట్, మీడియా, %ఐు%, కమ్యూనికేషన్స్... ఇలా ఎన్నో రంగాల్లో యువతకు అవకాశాలు దొరుకుతాయి. ఈ మెగా ఈవెంట్ ఉద్యోగ అవకాశాలను సృష్టించి, పర్యాటకాన్ని పెంచుతుందని, పెద్ద ఎత్తున జరిగే క్రీడా ఈవెంట్‌లకు సంబంధించిన రంగాలలో నిపుణుల వృద్ధికి తోడ్పడుతుందని తెలిపారు. కామన్వెల్త్ గేమ్స్ విజయవంతంగా నిర్వహించి ఒలింపిక్స్ కూడా నిర్వహించాలని కేంద్రం భావిస్తోంది.

# ఐపీఎల్‌కు గుడ్‌బై రవిచంద్రన్ అశ్విన్

### నా ఐపీఎల్ ప్రయాణం ఇక్కడితో ముగుస్తోందని పోస్ట్

### చెన్నై, పంజాబ్, ఢిల్లీ, రాజస్థాన్, పుణె జట్లకు ప్రాతినిధ్యం

### ఇప్పటికే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అశ్విన్




భారత్ స్టార్ బౌలర్ రవిచంద్రన్ అశ్విన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఐపీఎల్‌కు గుడ్‌బై చెప్తున్నట్లు ప్రకటించారు. చివరిగా అశ్విన్ చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఐపీఎల్ టోర్నీ ఆడాడు. ఐపీఎల్‌లో పలు ఫ్రాంచైజీ తరఫున కూడా అశ్విన్ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 221 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడిన అశ్విన్ 187 వికెట్లు తీశాడు. ఆయన చెన్నై, పంజాబ్, ఢిల్లీ, రాజస్థాన్, పుణె జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. ఇప్పటికే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అశ్విన్, తాజాగా ఐపీఎల్ నుంచి కూడా తప్పుకోవడంతో.. అతని ఫ్యాన్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అశ్విన్ తన నిర్ణయాన్ని సోషల్ మీడియా వేదిక %ం% లో వెల్లడించారు. "ఒక ప్రత్యేకమైన రోజు, అందుకే కొత్త ఆరంభం. నా ఐపీఎల్ ప్రయాణం ఇక్కడితో ముగుస్తోంది. కానీ, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా వివిధ లీగ్‌ల్లో ఆడేందుకు నా కొత్త అధ్యాయం మొదలవుతోంది" అని ఆయన తెలిపారు. అశ్విన్ తన 16 సీజన్ల ఐపీఎల్ కెరీర్‌లో మొత్తం 221 మ్యాచ్‌లు ఆడారు. ఇందులో 187 వికెట్లు తీశారు. ఆయన బౌలింగ్ సగటు 30.22 కాగా, ఎకానమీ రేట్ 7.20, స్ట్రైక్ రేట్ 25.2. ఉత్తమ బౌలింగ్ ఫిగర్స్ 4/34 వికెట్లు. బ్యాట్స్‌మన్‌గా కూడా అశ్విన్ రాణించారు. 92 ఇన్నింగ్స్‌ల్లో 833 పరుగులు సాధించారు. 118.15 స్ట్రైక్ రేట్, 13.01 సగటుతో తన బ్యాటింగ్ కొనసాగించారు. ఐపీఎల్‌లో అశ్విన్ అత్యధిక వ్యక్తిగత స్కోర్ 50 పరుగులు. చెన్నై సూపర్ కింగ్స్ తరఫున అశ్విన్ ఎన్నో మధుర క్షణాలను అందించారు. 2010, 2011లో ఐపీఎల్ టైటిల్ గెలుపులో కీలక పాత్ర పోషించారు. 2010లో ఛాంపియన్స్ లీగ్ టీ20లో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచారు. 2011 ఐపీఎల్ ఫైనల్లో మొదటి ఓవర్ వేసి, క్రిస్ గేల్‌ను డక్ అవుట్ చేసి జట్టును విజయం వైపు నడిపించారు. 2014లో మరోసారి ఛాంపియన్స్ లీగ్ టైటిల్ గెలిచారు. 2025లో చెన్నై సూపర్ కింగ్స్ టీమ్ అశ్విన్ ను రూ. 9.75 కోట్లు వెచ్చించి తిరిగి జట్టులోకి తీసుకుంది. 38 ఏళ్ల అశ్విన్ పదేళ్ల విరామం తర్వాత 2025లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో చేరాడు. ఎన్నో అంచనాలతో మెగా ఆక్షన్ లోకి అడుగుపెట్టిన అశ్విన్ ను చెన్నై రూ. 9.75 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది. లోకల్ ప్లేయర్ కావడంతో ఈ వెటరన్ స్పిన్నర్ పై సీఎస్కె యాజమాన్యం ఎన్నో అంచనాలు పెట్టుకుంది. అయితే ఐపీఎల్ 2025లో అశ్విన్ ఘోరంగా విఫలమయ్యాడు. తొమ్మిది మ్యాచ్‌ల్లో మాత్రమే ఆడి 9.13 ఎకానమీ రేటుతో ఏడు వికెట్లు మాత్రమే తీసుకున్నాడు. బ్యాటింగ్‌లోనూ రాణించింది లేదు. ఐపీఎల్ 2026 సీజన్ లో అశ్విన్ ను రిలీజ్ చేయడం ఖాయమనే హింట్స్ చెన్నై జట్టు నుంచి అందాయి. 2009 నుండి 2015 వరకు ఆరు సీజన్లు సీఎస్కె జట్టు తరఫున ఆడాడు. 2016 నుంచి 2024 మధ్య ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీలకు ప్రాతినిధ్యం వహించాడు.

# నేటి నుంచే కబడ్డీ పండుగ

### పీకేఎల్ సరికొత్త సీజన్ ప్రారంభం

### విశాఖపట్టణం వేదికగా అకురార్పణ






కబడ్డీ క్రీడను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) సరికొత్త సీజన్‌కు సర్వం సిద్ధమైంది. విశాఖపట్టణం వేదికగా దేశీయ కబడ్డీ లీగ్ ప్రారంభం కానుండగా ఈవెంట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. జాతీయ క్రీడా దినోత్సవాన వైజాగ్‌లో కబడ్డీ పండగ ప్రారంభం కానుంది. ప్రో కబడ్డీ లీగ్ 12వ సీజన్ ప్రారంభానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితరులు హాజరుకానున్నారు. పీకేఎల్ కొత్త సీజన్ విశేషాలు ఇలా ఉన్నాయి. కోట్లది మంది కబడ్డీ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. శుక్రవారం ఆరంభ మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్‌తో తెలుగు టైటాన్స్ ఢీ కొట్టనుంది. ఈసారి వినూత్న మార్పులతో సరికొత్త ఉత్సాహం, ఉత్కంఠమైన పోరాటాలతో ఈ సీజన్ ప్రేక్షకులకు కనువిందు చేయనుంది. ఏడేళ్ల తర్వాత వైజాగ్‌కు ఈ లీగ్ తిరిగి వస్తోంది. జాతీయ క్రీడా దినోత్సవం రోజున ప్రారంభం కానుండడంతో పెద్ద స్థాయిలో క్రీడాకారులు పాల్గొననున్నారు. ఈ సీజన్ ఆరంభ మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు, ఫేవరెట్ అయిన తెలుగు టైటాన్స్.. తమిళ్ తలైవాస్‌తో తలపడనుంది. రెండో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్, పుణెరి పల్టాన్ జట్లు పోటీపడనున్నాయి. ఈ మ్యాచ్‌లు వైజాగ్‌లోని విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌లో జరగనున్నాయి. కొత్త సీజన్‌కు శ్రీకారం చుడుతూ గురువారం వరుణ్ బీచ్‌లోని నోవాటెల్‌లో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమం క్రీడాకారులు, నిర్వాహకుల ఉత్సాహంతో నిండిపోయింది.

# 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడటమే నా లక్ష్యం

### నా రిటైర్‌మెంట్ ఎప్పుడనేది ఎవరూ నిర్ణయించలేరు

### ఆటపై విసుగు వచ్చేవరకే ఆడుతూనే ఉంటాను


### టీమ్ ఇండియాకు సీనియర్ ప్లేయర్ మహ్మద్ షమీ



టీమ్ ఇండియాకు సీనియర్ ప్లేయర్ మహ్మద్ షమీ తన రిటైర్‌మెంట్‌పై వస్తున్న వార్తలకు చెక్ పెట్టారు. ఇప్పటికే ముగ్గురు సీనియర్ క్రికెటర్లు టెస్టులకు వీడ్కోలు పలికిన నేపథ్యంలో తన పేరు కూడా జాబితాలో ఉందన్న రూమర్స్‌పై షమీ స్పష్టతనిచ్చారు. రెండేళ్లుగా టెస్ట్ క్రికెట్ ఆడని షమీ గాయాలతో ఇబ్బందులు ఎదుర్కొన్నా, 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడటం తన లక్ష్యమని చెప్పారు. "నా రిటైర్‌మెంట్ ఎప్పుడనేది ఎవరూ నిర్ణయించలేరు. ఆటపై విసుగు వచ్చేవరకే ఆడతాను. ఒకవేళ అంతర్జాతీయ క్రికెట్‌లో అవకాశం లేకపోతే దేశవాళీ క్రికెట్‌లో కొనసాగుతా. నేను రిటైర్ అయితే ఎవరి జీవితాలు బాగుపడతాయో చెప్పండి అప్పుడు ఆలోచిస్తా. అంతవరకు ఇలాంటి ఊహాగానాలకు విలువే లేదు" అని షమీ స్పష్టం చేశారు. తాజాగా తన ఫిట్‌నెస్ పరిస్థితిని కూడా వివరించాడు. "గత రెండు నెలల్లో శరీర బరువును కంట్రోల్ చేశా. నైపుణ్యాలను పదును పెట్టా. సుదీర్ఘంగా స్పెల్స్ వేసేలా ప్రాక్టీస్ చేస్తున్నా. ఫీల్డింగ్, బ్యాటింగ్‌లో కూడా కష్టపడి సాధన చేశా. ఇప్పుడు అన్ని విషయాల్లో కంఫర్ట్‌గా ఉన్నా" అని చెప్పారు. "నాకు ఇప్పటికీ ఒక కల ఉంది వన్డే వరల్డ్‌కప్‌ను సగర్వంగా ఎత్తుకోవాలి. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో ఫైనల్‌కు చేరాం. అభిమానుల మద్దతుతో అక్కడికి వెళ్లాం. కానీ ఫైనల్లో కొంచెం అదృష్టం కలిసి వచ్చివుంటే ట్రోఫీ మనదే అయ్యేది" అని షమీ గుర్తు చేసుకున్నాడు. మొత్తానికి షమీ రిటైర్‌మెంట్‌పై వస్తున్న వార్తలు కేవలం గాలివార్తలేనని తాను ఇంకా టీమ్ ఇండియాకు సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశాడు. ఇటీవల షమీ ప్రత్యేక మైలురాయిని చేరుకున్నాడు. వేగంగా 200 వన్డే వికెట్లు తీసిన భారత బౌలర్‌గా రికార్డు క్రియేట్ చేశాడు. మొత్తంగా ఈ ఫీట్ సాధించిన రెండో వేగవంతమైన బౌలర్‌గా నిలిచాడు. కేవలం 104వ మ్యాచుల్లో ఈ ఘనతను సాధించాడు. 133 మ్యాచుల్లో ఈ రికార్డు అందుకున్న భారత మాజీ పేసర్ అజిత్ అగార్కర్‌ను అధిగమించాడు. ఓవరాల్‌గా మిచెల్ స్టార్క్ (102) షమీ కంటే ముందున్నాడు. ప్రపంచ కప్, ఛాంపియన్స్ ట్రోఫీల్లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా రికార్డు క్రియేట్ చేశాడు. తన ఖాతాలో 60 వికెట్లు వేసుకున్నాడు. అతడి తర్వాత జహీర్ ఖాన్ (59), జవగల్ శ్రీనాథ్ (47) ఉన్నారు. షమీ తన చివరి వన్డే మ్యాచ్‌ను 2023 నవంబర్ 19న ఆస్ట్రేలియాతో ఆడాడు. అదే ఐసీసీ వన్డే ప్రపంచ కప్ 2023 ఫైనల్ మ్యాచ్. ఆ మ్యాచ్‌లో టీమ్ ఇండియా పరాజయంపాలై వరల్డ్ కప్‌ను చేజార్చుకుంది. ఆ తర్వాత గాయం కారణంగా షమీ అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమయ్యాడు. ఇటీవలే ఇంగ్లాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌తో షమీ మళ్లీ రీఎంట్రీ ఇచ్చాడు. ఆఖరి రెండు మ్యాచ్‌లు ఆడాడు. అయితే ఒక మ్యాచ్‌లో వికెట్టేమీ తీయలేదు. మరో టీ20లో మాత్రం మూడు వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు.

# రామ్‌చరణ్ పెద్దిలో వేయిమంది డ్యాన్సర్లతో షూట్

రామ్‌చరణ్ 'పెద్ది' సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. వినాయక చవితి వేళ కూడా చిత్ర బృందం షూట్‌లో పాల్గొంది. మైసూరులో మొదలైన తాజా షెడ్యూల్‌లో బుధవారం ఓ మాస్ సాంగ్‌ను చిత్రీకరించారు. జానీ మాస్టర్ ఆధ్వర్యంలో రామ్‌చరణ్‌తోపాటు- 1000 మందికిపైగా డ్యాన్సర్లతో సాంగ్ షూట్ చేపట్టారు. సెట్స్ నుంచే చిత్ర బృందం ప్రేక్షకులకు పండగ శుభాకాంక్షలు తెలిపింది. ఈ మేరకు వీడియో విడుదల చేసింది. గ్రామీణ నేపథ్యంతో తెరకెక్కుతున్న స్పోర్ట్స్ డ్రామా మూవీ ఇది. కొన్ని రోజుల క్రితం రామోజీ ఫిల్మ్ సిటీలో కీలక షెడ్యూల్ షూటింగ్ పూర్తిచేసుకున్న సంగతి తెలిసిందే. 'ఉప్పెన' ఫేం బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్. కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్, బాలీవుడ్ నటు-డు దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. హీరో- డైరెక్టర్, హీరో- హీరోయిన్ కాంబినేషన్లతోపాటు- ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఓ షాట్ మరిన్ని అంచనాలు పెంచింది. వచ్చే ఏడాది మార్చి 27న సినిమా విడుదల కానుంది.







# బాహుబలి ది ఎపిక్

## ప్రభాస్, తమన్నాల రోమాన్స్ కట్

రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కి.. తెలుగు సినిమా ఖ్యాతిని పెంచిన 'బాహుబలి' మరోసారి వండర్స్ సృష్టించడానికి ఒకేచిత్రంగా విడుదలవుతోంది. ఈ చిత్రం విడుదలై పదేళ్లు పూ-ర్తయిన సందర్భంగా మరోసారి ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయనున్నట్లు టీమ్ ప్రకటించింది. రెండు భాగాలుగా వచ్చిన సినిమాలను 'బాహుబలి: ది ఎపిక్' పేరుతో ఒకే భాగంలో తీసుకురానున్నారు. అయితే అందులోని ఏ సన్నివేశాలను కట్ చేస్తారా? అని అందరిలో ఆసక్తి నెలకొంది. తాజాగా ఓ హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దర్శకధీరుడు ఈ సినిమాకు సంబంధించిన కొన్ని విషయాలను పంచుకున్నారు. బాహుబలి: ది ఎపిక్' రిలీజ్ విషయంలో అన్నిటికంటే కష్టమైన పని ఎడిటింగ్ అన్నరు. రెండూ కలిపి దాదాపు 5 గంటల 27 నిమిషాల రన్-టైమ్ ఉన్నాయి. వీటిని కట్ చేసి ఒక భాగంగా విడుదల చేయాలి. ఏ సన్నివేశాలను ఉంచాలి? వేటిని తీసేయాలి? అనే విషయంపై మేం తీవ్రంగా చర్చించుకుంటున్నట్లు వెల్లడించారు. 'బాహుబలి'లోని ప్రతి సన్నివేశం, పాట నాకు విలువైనదే. దేన్ని తీసేయాలో అర్థం కాలేదు. నిడివి తగ్గించాలంటే కొన్ని కట్ చేయక తప్పదు. అందుకే పాట, కొన్ని సన్నివేశాలను తొలగించాలని నిర్ణయించాం. 'కన్నా నిదురించరా' పాటను కట్ చేశాం. అలాగే, ప్రభాస్-తమన్నా మధ్య సాగే కొన్ని రొమాంటిక్ సన్నివేశాలను కూడా తొలగించాలని నిర్ణయించుకున్నాం. 'బాహుబలి: ది ఎపిక్'తో ప్రేక్షకులకు కొత్త అనుభవాన్ని ఇవ్వాలనుకుంటున్నా అని రాజమౌళి తెలిపారు. అక్టోబర్ 31న ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా ఈ మూవీ విడుదల కానుంది. దీని నిడివి విషయంలో ఎన్నోవార్తలు వస్తున్నప్పటికీ చిత్రబృందం మాత్రం ఇప్పటి వరకూ అధికారికంగా స్పందించలేదు. ఎన్ని గంటలు ఉంటుందనే విషయం రాజమౌళికి తప్ప మరెవ్వరికీ తెలియదని నటు-డు రానా తెలిపారు. తాజాగా విడుదలైన ఈ సినిమా టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది.



# ఓజి సువ్వి..సువ్వి పాట విడుదల

పవన్ కల్యాణ్ హీరోగా దర్శకుడు సుజీత్ తెరకెక్కిస్తున్న సినిమా 'ఓజీ'. పవన్ సరసన ప్రియాంకా మోహన్ నటిస్తున్నారు. గ్యాంగ్‌స్టర్ యాక్షన్ థ్రిల్లర్‌గా సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. వినాయక చవితి సందర్భంగా తాజాగా ఈ సినిమా నుంచి 'సువ్వి.. సువ్వి' పాటను చిత్రబృందం విడుదల చేసింది. 'ఉండిపో ఇలాగా.. తోడుగా.. నా మూడు ముళ్లలాగా' అంటూ సాగే లిరిక్స్ కల్యాణ్ చక్రవర్తి రాయగా.. శ్రుతి రంజనీ ఆలపించారు.

# మిరాయ్ ట్రైలర్ విడుదల

యువ నటుడు తేజ సజ్జా ప్రధానపాత్రలో రూపొందుతోన్న చిత్రం 'మిరాయ్'.మంచు మనోజ్ ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో ఇది రానుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. 2 నిమిషాల 58 సెకన్లు ఉన్న ఈ వీడియోలో సినిమాలో వీఎఫ్‌ఎక్స్ ఎఫెక్ట్‌లు ఏ స్థాయిలో ఉండనున్నాయో చూపారు. డ్రాగన్‌తో హీరో పోరాటం, 'దునియాలో ఏదీ నీది కాదు..' అంటూ వచ్చే డైలాగులు ఆకట్టుకుంటున్నాయి. సెప్టెంబర్ 12న ఈ సినిమా విడుదల కానుంది. టాలీవుడ్ ప్రేక్షకులు ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నా చిత్రాలో 'మిరాయ్' ఇకటి. తేజ సజ్జా హీరోగా, కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైప ప్రతి ఒక్క అప్‌డేట్ లో యాక్షన్ సన్నివేశాలను మరొక స్థాయికి తీసుకెళ్లగా.. తాజాగా ఈ సినిమా -ట్రైలర్ విడుదల చేశారు. కాగా ఈ -ట్రైలర్ మంచి ప్రామిసింగ్‌గా ఉందని చెప్పాలి. ముఖ్యమైన ఓ 9 శక్తివంతమైన గ్రంథాలు.. వాటి కోసం వెతికే విలన్, వాటిని అతనికి చిక్కకుండా చేసేందుకు పోరాటం చేసే హీరో ఈ మధ్యలో సాలిడ్ యాక్షన్, అడ్వెంచర్ ఎలిమెంట్స్ ఊహించని లెవెల్లో ఉన్నాయి. మొత్తనికి సెపరేట్ ప్రపంచాన్ని చూపిస్తూ మేకర్స్ ఇంప్రెస్ చేశారు. కాగా ఈ కార్యక్రమంలో తేజ సజ్జా మాట్లాడుతూ.. 'నేను పాన్ ఇండియా హీరో కావాలనుకోవడం లేదు. ఎందుకంటే మన తెలుగు ప్రేక్షకుల కోసం మాత్రమే నటిస్తున్నాను. మీ అందరి మెప్పు కోసం వర్క్ చేస్తున్నాను. నా సినిమా మిగతా వారికి నచ్చితే అది బోనస్ మాత్రమే. నేను ఎల్లప్పుడూ మీ దగ్గరే ఉంటాను, మీ కోసం ప్రెస్ మీట్స్ నిర్వహిస్తాను. ఈ సినిమాలో మంచు మనోజ్ కనిపించిన ప్రతిసారీ ఆడియన్స్‌కు గూస్ బంప్స్ వస్తాయి' అని తెలిపారు. అలా తేజ తన అభిమానుల పట్ల

ఉన్న ప్రత్యేక అభిమానాన్ని, వారి కోసం చేస్తున్న కృషిని స్పష్టంగా వ్యక్తం చేశారు. ఆయన చెప్పినట్లు-, ఈ సినిమా పూర్తిగా తెలుగు ప్రేక్షకుల కోసం కట్టు-బడి రూపొందించబడింది. ఈ ప్రాజెక్ట్‌లోని ప్రతి సన్నివేశం ప్రేక్షకులకు కొత్త అనుభవాన్ని ఇవ్వనుందని అర్థం అవుతుంది.



# పచ్చదనంతో అందాల జాన్వీ పులకింపు

అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలుగా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ జాన్వీ కపూర్. తల్లి శ్రీదేవి మరణంకు ముందే జాన్వీ కపూర్ మొదటి సినిమా ప్రారంభం అయింది. కానీ జాన్వీ నటించిన మొదటి సినిమా 'ధడక్' విడుదలకు ముందే శ్రీదేవి చనిపోయింది. హీరోయిన్‌గా జాన్వీ కపూర్‌కి కమర్షియల్ బ్రేక్ రాకున్నా అందం కారణంగా వరుస ఆఫర్లు వస్తున్నాయి. 2018 నుంచి జాన్వీ కపూర్ బ్రేక్ కోసం ఎదురు చూస్తుంది. తెలుగులో మొదటి సినిమా దేవర మంచి విజయాన్ని సొంతం చేసుకుంది, కానీ ఆ సినిమాలో జాన్వీ కపూర్ పాత్ర విషయంలో చాలా మంది విమర్శలు చేశారు, ప్రాధాన్యత లేని పాత్ర అని, హీరోయిన్ పాత్ర కాదు అంటూ జాన్వీ కపూర్‌ను చాలా మంది చాలా రకాలుగా ట్రోల్ చేసిన విషయం తెల్సిందే. అయినా జాన్వీ కపూర్ వాటి గురించి ఎప్పుడూ స్పందించదు. దేవర సినిమా తర్వాత తెలుగులో జాన్వీ కపూర్ చేస్తున్న మూవీ 'పెద్ది'. రామ్ చరణ్ హీరోగా బుచ్చి బాబు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా రంగస్థలం సినిమా రేంజ్‌లో అంతకు మించి అన్నట్లుగా ఉంటుంది అంటూ బుచ్చిబాబు సన్నిహితులు చెబుతున్నారు. రామ్ చరణ్, జాన్వీ కపూర్ కాంబో రొమాంటిక్ లవ్ సీన్స్ సైతం ఆకట్టుకుంటాయి అంటున్నారు. బుచ్చిబాబు దర్శకత్వంలో సినిమా అంటే హీరోయిన్‌కి గుర్తింపు, క్రేజ్ ఉంటుంది. అందుకే ఈ సినిమా తప్పకుండా భారీ విజయాన్ని కట్టబెడుతుంది అనే విశ్వాసం ను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. జాన్వీ కపూర్‌కి మరో బ్లాక్ బస్టర్ విజయాన్ని పెద్ది కట్టబెట్టడం ఖాయం అని ఫ్యాన్స్ నమ్మకంగా ఉన్నారు. సోషల్ మీడియాలో జాన్వీ కపూర్ రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం మనం చూస్తూ ఉంటాం. ఈ మధ్య కాలంలో ఆమె నుంచి వచ్చిన ప్రతి ఫోటో షూట్ వైరల్ అవుతోంది. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఔట్ ఫిట్‌ను ధరించడం ద్వారా జాన్వీ కపూర్ ఎప్పటికప్పుడు వైరల్ కావడం మనం చూస్తూ ఉంటాం. తాజాగా మరోసారి జాన్వీ కపూర్ తన అందమైన ఫోటోలను షేర్ చేసింది. ఈసారి గ్రీన్ డ్రెస్‌లో చూపు తిప్పనివ్వడం లేదు అన్నట్లుగా ఉంది. జాన్వీ కపూర్ ఎప్పుడు ఎలాంటి ఫోటోలు షేర్ చేసినా చాలా స్పెషల్‌గా అనిపిస్తాయి. ఈసారి కూడ ఆ గ్రీన్ డ్రెస్‌లో ఒక మూవీ ప్రమోషన్‌లో పాల్గొన్న జాన్వీ కపూర్ అక్కడి ప్రకృతికి పులకించినట్లుగా ఫోటోలకు ఫోజ్ ఇచ్చింది. పెద్దగా స్కిన్ షో చేయకున్నా కూడా ఇలాంటి అందంతో కన్నుల విందు చేస్తుందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.



# ఘాటి ప్రమోషన్లలో కనిపించని అనుష్క

పాన్-ఇండియా స్థాయిలో భారీ అంచనాలతో 'ఘాటి' అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సినిమా సెప్టెంబర్ 5న థియేటర్లలో రిలీజ్‌కి సిద్ధమవుతోంది. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో యాక్షన్ క్రైమ్ డ్రామా, గంజాయి మాఫియా నేపథ్యంలో రూపొందుతున్న ఈ మూవీలో అనుష్క ఓ శక్తివంతమైన గిరిజన మహిళ గా కనిపించనుంది. ఇప్పటికే ఈ సినిమా ఫస్ట్ లుక్‌లో అనుష్క అదిరిపోయే గెటప్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఫ్యాన్స్‌లో ఫుల్ హైప్ నెలకొంది. అయితే ఈ మధ్య కాలంలో సినిమా తో పాటు-ప్రమెషన్స్ విషయంలో కూడా ప్రతి ఒక్క మూవీ టీం చాలా కష్టపడుతున్నారు. కానీ, 'ఘాటి' ప్రమోషన్స్‌లో అనుష్క కనిపించకపోవడం సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయింది. అయితే.. ఈ విషయంపై నిర్మాత స్పష్టత ఇచ్చారు.. అనుష్క ప్రమోషన్స్‌లో పాల్గొనబోనని షూటింగ్‌కు ముందే స్పష్టంగా తెలిపింది. ఆ మేరకు ఒప్పందం కూడా కుదిరిందని తెలిపారు. దీంతో ఆమె ఎందుకు ప్రమోషన్స్‌కు దూరంగా ఉన్నది? అనే ప్రశ్న పై టాలీవుడ్ వర్గాల్లో రూమర్లు వినిపిస్తున్నాయి. వ్యక్తిగత కారణాలా, లేదా ఇతర సినిమాల కమిట్‌మెంట్స్ కారణమా అన్నది తెలిడం లేదు. ప్రీరిలీజ్ ఈవెంట్‌కు అయినా అనుష్క హాజరేయేనా? అనే అంశం ఫ్యాన్స్‌లో చర్చనీయాంశంగా మారింది. అంటే దీని బట్టి సినిమా షూటింగ్ వరకు మాత్రమే అనుష్క కమిటైనట్లు-, ప్రమోషన్, సక్సెస్ మీట్‌లకు హాజరు కారని స్పష్టంగా తెలుస్తోంది. కానీ అనుష్క హాజరు కాలేకపోయినా, ఘాటి టీమ్ దేశవ్యాప్తంగా ప్రమోషన్లకు సిద్దంగా ఉంది.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463